ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 19 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.2



రోప్‌వే పిల్లర్ నిర్మాణానికి సాయిల్ టెస్టింగ్ చేస్తున్న కార్మికులు



భువనగిరి ఖిల్లా రోప్‌వే పనులకు టెండర్ల గ్రహణం వీడింది. రెండు ప్యాకేజీలుగా పిలిచిన టెండర్లలో రోప్‌వే పనులకు సంబంధించిన టెండర్లు ఖరారయ్యాయి. మిగతా పనులకు సంబంధించిన టెండర్‌కు ఈ నెల 25వ తేదీతో బిడ్ల దాఖలు గడువు పూర్తికానుంది.

- (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)

భువనగిరి ఖిల్లా రోప్‌వేకు
టెండర్లు ఖరారు

» మిగతా పనులకు త్వరలో..
» రూ.56.81కోట్ల విలువైన పనులు రెండు ప్యాకేజీలుగా విభజన

స్వదేశీ దర్శన్ 2.0కు ఎంపికైన భువనగిరి ఖిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించింది. ఈ మేరకు మొదటిదశలో రూ.56.81కోట్లు విడుదల కాగా, ఆ నిధులతో రోప్‌వే సహా ఇతర అభివృద్ధి పనులకు ఒకే ప్యాకేజీగా ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో రాష్ట్ర పర్యాటకశాఖ మార్చి మూడో వారంలో టెండర్లు పిలిచింది. కానీ అంచనాల రూపకల్పనలో వాస్తవికత లోపించిందనే కారణంతో కాంట్రాక్టర్లు టెండర్ బిడ్స్ దాఖలు చేయలేదు. దీంతో అవే నిధులతో పనుల అంచనాలను సవరించి రోప్‌వే ఒక ప్యాకేజీగా, మిగతా పనులను మరో ప్యాకేజీగా విభజించారు. ఈ మేరకు రోప్‌వే కోసం పిలిచిన టెండర్లను ఈ నెల 3న తెరవగా, రూ.18.05కోట్లతో కోల్‌కత్తాకు చెందిన ఏజెన్సీ ఈపనులను దక్కించుకుంది. మిగతా రూ.38.76కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన ఖిల్లాపై కోట గోడ,కట్టడాల మరమ్మతులు, రెస్టారెంట్లు, ఖిల్లా ముఖద్వారం, ప్రస్తుత టికెట్ కౌంటర్ ఆధునికీకరణ తదితర అభివృద్ధి పనుల ప్యాకేజీ టెండర్ గడువు ఈ నెల 25తో ముగియనుంది. అయితే రాష్ట్రంలోనే మొట్టమొదటగా భువనగిరి ఖిల్లా పైకి నిర్మిస్తున్న రోప్‌వే పనులకు టెండర్లు ఖరారు కావడంతో స్థానికులతో పాటు పర్యాటక ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాల్లో తేడాలతోనే పనుల్లో జాప్యం

భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనుల ప్రతిపాదనల రూపకల్పనలో తేడాలతోనే పనుల ప్రారంభంలో జాప్యం నెలకొన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. స్వదేశీ దర్శన్ 2.0కు భువనగిరి ఖిల్లా ఎంపికైన వెంటనే పలువురు రాష్ట్ర, కేంద్ర ఉన్నతాధికారులు పలుమార్లు ఖిల్లాను సందర్శించి చేపట్టాల్సిన పనులపై సమీక్షించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించే బాధ్యతను ఓ ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించారు. ఈ మేరకు ఆ సంస్థ బృందం పదుల సార్లు ఖిల్లాను సందర్శించి పలువురితో చర్చించి డీపీఆర్‌ను రూపొందించింది. ఆ డీపీఆర్ ఆధారంగా అధికారులు ఒకే ప్యాకేజీగా టెండర్లను పిలవగా పనుల అంచనా వ్యయాల్లో తారతమ్యాలు, సాంకేతిక కారణాలు చూపుతూ కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో రెండో దశలో పనులను రెండుగా విభజించి టెండర్లు పిలిచారు. దీంతో రోప్‌వే పనుల టెండర్లు ఖరారు కాగా, మిగతా పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. అయితే రోప్‌వే నిర్మాణంలో కీలకమైన పిల్లర్స్ నిర్మాణానికి పనులు దక్కించుకున్న ఏజెన్సీ సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను చేపట్టింది. టెండర్లు పూర్తయ్యాక పనులను అధికారికంగా ప్రారంభిస్తారని తెలిసింది. పనుల పూర్తికి సుమారు ఏడాదిన్నర కాలం పడుతుందని అంచనా ఉంది.

జీతాలు అద్దెలు
లేవ్

» గురుకులాలకు ఏడు నెలలుగా బకాయిలు
» ఉమ్మడి జిల్లాలో 82 గురుకులాలు » అద్దె భవనాల్లో 55
» అద్దెలు రాక ఇబ్బందులుపడుతున్న యజమానులు
» గురుకులాల్లో పనిచేస్తున్న 3,280 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి అందని రూ.26 కోట్ల జీతాలు



(ఆంధ్రజ్యోతి-కోదాడ) : బడుగు, బలహీన విద్యార్థులకు విద్యను దగ్గర చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకులాలు ఏర్పాటుచేసింది. ఫలితంగా పేద విద్యార్థులు గురువుల వద్ద ఉంటూ, సహజ వాతావరణంలో జీవిస్తూ, విద్యాభ్యాసంతో పాటు తోటి విద్యార్థులతో స్నేహభావం, వ్యక్తిగత నైపుణ్యం, జ్ఞానంతో పాటు నైతిక విలువలు అలవర్చుకొని జీవితంలో రాణిస్తారనేది ప్రభుత్వ తలంపు. ఈ క్రమంలో కొన్నిచోట్ల సొంత భవనాల్లో, మరికొన్ని చోట్ల అద్దె భవనాలలో విద్యను అందిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 82 గురుకులాలు ఉంటే వాటిలో 55 భవనాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గత ఏడు నెలలుగా వాటికి సుమారు రూ.13.47 కోట్ల అద్దె సొసైటీ వారు చెల్లించకపోవటంతో భవన యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి సమస్య వచ్చినా భవన యజమానులు పట్టించుకోవటంలేదు. దీంతో మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక 82 గురుకులాల్లో పనిచేస్తున్న

- మిగతా 7వ పేజీలో...

వెట్టిచాకిరీతో వెతలు

నర్సులపైనే పీహెచ్‌సీల నిర్వహణ భారం



» డాక్టర్లు మొదలుకుని స్వీపర్ల వరకు
» అన్ని పనులు నర్సులే చేయాల్సిన పరిస్థితి
» 24గంటల ఆసుపత్రుల్లో తీవ్ర పనిఒత్తిడి
» జీవో 142 అమలు చేయాలని డిమాండ్
» అమలు చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం
» కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని నర్సింగ్ అధికారుల ఆరోపణ » సతమతమవుతున్న నర్సులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సులు పనిభారంతో సతమతమవుతున్నారు. 24గంటల పీహెచ్‌సీలలో అయిదుగురు చొప్పున నర్సులను నియమించాల్సి ఉండగా, ప్రభుత్వం ముగ్గురితోనే సరిపుచ్చుతుండటంతో తమపై పని ఒత్తిడి పెరిగిందని నర్సులు వాపోతున్నారు. ఆఫ్‌లైన్ విధులతో పాటు, అదనంగా ఆన్‌లైన్ విధులు నిర్వర్తించాల్సి వస్తుండటంతో ఊపిరి తీసుకోని విధంగా పని చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల పనులు మొదలుకుని ఆయాల పనుల వరకు అన్నీ తామే చేయాల్సి వస్తోందని, ఇదేమని ప్రశ్నిస్తే మెడికల్ అధికారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని, తమకు ఉపశమనం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నర్సులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 24 గంటల ఆరోగ్య కేంద్రాల్లో నర్సింగ్ అధికారులే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఎవరు విధులకు రాకున్నా, వచ్చినా, నర్సులు మాత్రం నిత్యం అందుబాటులో ఉండి పనులు చేయాల్సి వస్తోంది. రాత్రివేళ ఎమర్జెన్సీ కేసులు వస్తే డాక్టర్లు హాజరవ్వాల్సి ఉన్నా, మెజార్టీ ఆసుపత్రులకు డాక్టర్లు రావడం లేదు. నర్సులే ఫోన్లలో మాట్లాడుతూ జాగ్రత్తగా వైద్యం అందించాల్సి వస్తోంది. రోగులను, వారి అటెండెంట్లను సముదాయించి సమీప పెద్దాసుపత్రులకు పంపాల్సి వస్తోంది. నర్సులకు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాల్సిన రెస్ట్‌రూమ్‌లు, వాష్‌రూమ్‌లు, డ్రెస్సింగ్ రూమ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారిందని వాపోతున్నారు. నర్సులు పని చేసే చోట్ల కాంతివంతమైన వెలుగు ఉండేలా విద్యుత్ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుండగా, కనీసం పీహెచ్‌సీలలో విద్యుత్ సైతం ఉండటం లేదని, కరెంటు పోతే ఇన్వర్టర్లు పనిచేయడం లేదని, సదుపాయాలు కావాలని అడిగితే మెడికల్ ఆఫీసర్లు సతాయిస్తున్నారని పలువురు నర్సులు 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. డ్యూటీలో భాగంగా డాక్టర్లు రాసిచ్చిన ప్రిస్కిప్షన్ ప్రకారం రోగులకు మందులివ్వడం, ఇంజక్షన్లు ఇవ్వడంతో పాటు, కట్లు కట్టడం, ఓపీ చూడటం వంటి పనులన్నీ నర్సులే చేయాల్సి వస్తోంది. సపోర్టింగ్ స్టాఫ్ ఆయాలు, స్వీపర్లు సైతం అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు.

జీవో 142 అమలు చేస్తే నర్సులకు ఉపశమనం

నర్సింగ్ సేవల్లో నాణ్యతను పెంచడంతో పాటు, నర్సింగ్ స్టాఫ్‌కు పనిభారం నుంచి ఉపశమనం కలిగించేందుకు వీలుగా 2023లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.142 విడుదల చేసింది. దీని ప్రకారం ప్రతీ 24 గంటల పీహెచ్‌సీలో అయిదుగురు నర్సులను నియమించాల్సి ఉంటుంది. అదేవిధంగా పీహెచ్‌సీలలో జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా మరో ఇద్దరు ఏఎన్ఎమ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాల్సి ఉంది. అయితే జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద ఈ నియామకాలకు బడ్జెట్ లేదనే సాకు చెబుతున్నారు. అయితే వాస్తవానికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రంలో ఖర్చు చేయడానికి భారీగా నిధులు వస్తున్నా, వాటిని వినియోగించకుండా కాలయాపన చేస్తున్న విషయాలు పలుమార్లు వెలుగులోకి....

- మిగతా 8వ పేజీలో...

24గంటల పీహెచ్‌సీల్లో ఐదుగురు నర్సులు ఉండాల్సిందే

24గంటల పీహెచ్‌సీలలో తప్పనిసరిగా అయిదుగురు నర్సులతో పాటు ఒక రిలీవర్‌ని నియమించాల్సిందేనని పలువురు నర్సింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురితోనే నెట్టుకొస్తుండటంతో విధుల్లో ఉండే నర్సులు సెలవులు లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. పబ్లిక్ హాలిడేస్, సీఎల్స్ ఇతర ప్రత్యేక లీవులను సైతం వాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆపద వచ్చినా ఉద్యోగం చేయక తప్పడం లేదని నర్సులు వాపోతున్నారు. అంతేకాక ప్రతీ నర్సు అదనంగా పనిచేయకతప్పడం లేదని చెబుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అధికారుల నుంచి వేధింపులు వస్తున్నాయని, ఏడ్చి గోల చేస్తే తప్ప అత్యవసర సమయాల్లో సైతం సెలవులు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



నల్లగొండలో ఏసు శిలువ దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు •8లో..

పరుల కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తాం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మునుగోడు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మనకోసం కాకుండా పరుల కోసం జీవిస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలివెల గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన కోసం కాకుండా పరుల కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తామని, దానికి గురునాథ్‌రెడ్డి, బచ్చిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి నిదర్శమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం చేసి యావత్ తెలంగాణ ప్రజలకు వారు పోరుబాట చూపారన్నారు. గురునాథ్‌రెడ్డి నాటి చిన్న కొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నైజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పలివెలగడ్డ నుంచి కొండవీటి కుటుంబంతో పాటు ఎంతోమంది యోధులు తిరుగుబాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీర్ల ఫోరం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు, కొండవీటి సునీల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వరాజ్యం, మాజీ జడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, చెరుకుపల్లి వెంకన్న, చెరుకు జనార్ధన్, చెరుకు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో
శాంతిభద్రతలు క్షీణించాయి



మల్లీశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

● ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
● మల్లీశ్వరి కుటుంబ సభ్యులకు పరామర్శ

నిడమనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామానికి చెందిన దళిత యువతి దర్మారపు మల్లీశ్వరి చిత్రపటానికి శుక్రవారం రాత్రి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మల్లీశ్వరిది ఆత్మహత్య కాదని, కుల వివక్ష చేసిన హత్య అని ఆరోపించారు. మల్లీశ్వరి మృతిపై పోలీసులు కేవలం అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, ఇంతవరకు తల్లిదండ్రుల వాంగ్మూలం కూడా తీసుకోలేదని విమర్శించారు. ఆమె మృతికి కారణమైన అందరు నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత బిడ్డకు అన్యాయం జరిగితే సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. భట్టి విక్రమార్క, సీతక్కకు సిగ్గుందా? అని ఘాటుగా విమర్శించారు. అగ్ర కులానికి చెందిన దిశ అనే యువతిపై అఘాయిత్యం జరిగితే ఎన్‌కౌంటర్లు చేసిన ఘటనలు గతంలో ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్‌కౌంటర్ చేయాలని తాము కోరడం లేదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఇంత సంఘటన జరిగినా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జానారెడ్డి పరామర్శించకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఆందోళన చేస్తామన్నారు. పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, నాయకులు తాటి సత్యపాల్, కామర్ల జానయ్య, రాం అంజయ్య, బొల్లం రవి, చిలుముల సంతోష్, పెదమాము యాదయ్య, నల్లబోతు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిడమనూరు మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



పజ్జూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు వెంటనే నగదు చెల్లించేలా చూడాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని పజ్జూరు, గోదారిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ నిర్వాహకులు చూసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాగునీరు, చలువ పందిళ్లు ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, ఆయా గ్రామాల సీసీలు, వీబీకేలు, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని మగ్దుం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం వల్ల మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా స్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్ని వర్గాల ప్రజలు ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను సంపన్న వర్గాలకు కట్టబెడుతోందని, పేదలపై పన్నుల భారం మోపుతుందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500లకు గ్యాస్ పంపిణీ చేస్తుంటే కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర రూ.50లు పెంచడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న భూభారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తున్నాయని, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, పల్లా నర్సింహారెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, పల్లె నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, అంజయ్య చారి, బొల్గూరి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్పునకు మార్గం పుస్తకపఠనం

● జీవనగతిని మార్చేది పుస్తకపఠనమే...


● జీవితాల్ని సాఫల్యం చెందిస్తాయంటున్న ప్రముఖులు



మనోగతం

ప్రపంచాన్ని చుట్టివచ్చినంత జ్ఞానాన్ని ఇచ్చేది పుస్తకం. ఒక పుస్తకం వ్యక్తిలోని ఆలోచనలను మార్చడమే కాదు, వారి జీవన సాఫల్య సోపానాలకు సుగమమైన మార్గాన్ని వేస్తుంది. ఆలోచనా సరళిని మార్చడంతో పాటు ఎదురయ్యే సవాళ్లను సులభంగా తీసుకునేలా చేస్తుంది. అలాంటి పుస్తకాలు ఖచ్చితంగా చదివి తీరాల్సిందే అంటున్నారు పుస్తకప్రియులు. పుస్తక పఠనం మంచి లక్షణమని, తమ జీవితాన్ని మార్చిన తొలి పుస్తకం గురించి పలువురి అభిప్రాయాలు మీ కోసం...

గాంధీ రచనల ప్రభావం ఉంది



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

బాల్యంలో చందమామ, బొమ్మరిల్లు కథలు ఎంతో ఇష్టంగా చదివేవారం. ఒక్కొక్కరం కథలు చదవుతూ హావ భావాలు ప్రదర్శిస్తుంటే హాయిగా నవ్వుకునేవాళ్లం. ఇంటర్మీడియట్ స్థాయిలో నేను చదివిన పుస్తకం మహాత్మాగాంధీ రాసిన 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్ విత్ ట్రూత్' ఆత్మకథ పుస్తకం. నన్ను ఆలోచింప చేసింది. ఆయన ఆలోచనలు, సత్యం కోసం ఆయన చేసిన కృషిని ఈ పుస్తకం వివరిస్తుంది. సమాజాన్ని ఒకే కుటుంబంగా పరిగణించి ఆయన నడిపిన స్వాతంత్రోద్యమం ఒక స్ఫూర్తి. తాను చెప్పే వాటిని నిజజీవితంలో కడదాకా ఆచరిస్తూ నా జీవితమే సందేశం అని ప్రకటించుకున్నాడు. ప్రతీ వ్యక్తి తన ఆలోచనలకు అనుగుణంగా జీవించినప్పుడే అన్నింటా తనను తాను వ్యక్తీకరించుకోగలడు. నలుగురిని ఆ మార్గంలో పయనింపచేయగలడు. ఆలోచనలకు అనుగుణంగా కొంతదూరం నడక సాగించాను. సత్యాన్వేషణలో సమాధానాలు లేని ప్రశ్నలే ఎదురయ్యాయి. ఉరికంబం ఎక్కినా చెరగని చిరునవ్వు భగత్‌సింగ్, మన్యం వీరుడు అల్లూరి స్వాతంత్ర్యయోధుల జీవితాలను చదవాల్సిందే. విషయం తెలిసినవాడికి తెగించే ధైర్యం లేకపోవడం, తెగించే ధైర్యం వున్నవాడికి విషయమేదో తెలియకపోవడం దేశ గమనంలో మార్పు రాకపోవడానికి కారణమని నమ్ముతున్నా. నోట్ల ఓట్ల పాలనలో మార్పు మరెంత దూరమో వేచిచూడాలి. సమాజ స్థితిని మార్చేది చదువు. ఒకే బడి, ఒకే యూనిఫాం, ఒకే గురువు, ఒకే చదువు, ఒకే పరీక్ష దేశ మార్పునకు అదే సంకేతమవుతోంది.



సీడీ రవికుమార్, ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్

పుస్తకం ప్రపంచాన్ని పరిచయం చేసింది




(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

నేను సూర్యాపేటలో డిగ్రీ రెండో సంవత్సరం చదవుతున్న రోజుల్లో దేగల జనార్ధన్ అనే మిత్రుడితో పరిచయమైంది. అతడు ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తి. అప్పటికే ఆయన చాలాపుస్తకాలు అధ్యయనం చేశారు. చిన్నవయస్సులోనే విస్తృత జ్ఞానం సంపాదించారు. అతడితో నిరంతరం స్నేహం చేయడం వల్ల నాలో కూడా పుస్తకాలు చదవాలనే స్పృహ పెరిగింది. దీంతో సూర్యాపేట పోస్టాఫీస్ పక్కన ఉన్న స్టార్ బుక్ హౌస్‌కు వెళ్లి సోవియట్ ల్యాండ్ పుస్తకాలు, మాక్సిమ్ గోర్కీ రాసిన అమ్మ నవలను, తాపీ ధర్మారావు రాసిన పెండ్లి దాని పుట్టు పూర్వోత్తరాలు, సీపీ రాసిన పుస్తకాలు, లెనిన్ రచనలు చదివేవాడిని. వాటితో పాటు కారల్ మార్క్స్ పెట్టుబడి, శ్రీశ్రీ మహాప్రస్థానం, వరవరరావు రాసిన భవిష్యత్తు చిత్రపటం, కవితా సంపుటి చదివాను. ఇలా అనేక పుస్తకాలు చదవడం ప్రారంభించాను. అదే సమయంలో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం ప్రారంభించడంతో విద్యా సంబంధమైన పోటీ పరీక్షల్లో సులభంగా ఉత్తీర్ణుడయ్యా. ఆనాటి నుంచి పుస్తకాలు చదవడం అనేది ఒక అలవాటుగా మారింది. పుస్తకం ఈ ప్రపంచాన్ని పరిచయం చేసింది. నన్ను విస్తృత మానవుడిగా తీర్చిదిద్దింది. హైదరాబాద్‌లో పీజీ చదువుతున్న రోజుల్లో ఆబిడ్స్ ప్రాంతానికి వెళ్లి పాత పుస్తకాలను కొనుక్కుని చదువుకునే వాడిని. పుస్తకాలతో స్నేహం విడదీయరానిదిగా ఏర్పడింది. ఇప్పటికీ ఏదో ఒక పుస్తకం చదవాల్సిందే. కొన్ని సమీక్ష వ్యాసాలు రాయాల్సిందే.




పెరుమాళ్ల ఆనంద్, ప్రముఖ సాహితీ వేత్త, ఆంగ్ల ఉపాధ్యాయుడు, నల్లగొండ

మనుష్య ధర్మం పుస్తకం ప్రేరణ కలిగించింది



(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

మనుష్య ధర్మం పుస్తకం ఎంతో ప్రేరణ కలిగించింది. ప్రముఖ రచయిత కందుకూరి వీరేశలింగంపంతులు రచించిన పుస్తకాన్ని మొదట చదివా. ఆ పుస్తకంలో అనేక రచనలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మనో నిశ్చయం, ధైర్యం,నిరంతరకృషి, కార్యసాధకుడు ఈ మూడు లక్షణాలు కలిగి ఉంటే ప్రతీ మనిషి జీవిత లక్ష్యాన్ని సాధించగలడు. 'మనుష్యధర్మం' పుస్తకంలోని అనేక అంశాలను నేను జీవితంలో పాటిస్తూ ముందుకు సాగుతున్నా. మానవుడు ఒంటరి అయినప్పటికీ ఇతర జనులు ఎన్ని నిందారోపణలు చేసినా అనుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ముందుకుసాగితే విజయాలు సాధించవ్చని మనుష్యధర్మం పుస్తకంలో చెప్పిన రచనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



- పశ్య శ్రీనివాస్‌రెడ్డి, ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్, హుజూర్‌నగర్

చదువుతో పాటు సంస్కారం

ఆదర్శం బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల నిర్వహణ



విద్యార్థులకు బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 10వ వార్డులోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆదర్శవంతంగా నిలుస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ తల్లిదండ్రుల ఆదరాభిమానాలను ఉపాధ్యాయులు చూరగొంటున్నారు. చదువుతో పాటు సంస్కారాన్ని అలవరచుకునేలా విద్యార్థుల్లో క్రమశిక్షణను నేర్పిస్తున్నారు. మూడు దశాబ్దాల కిందట ప్రారంభించిన ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. పేదవర్గాల కాలనీలో ఏర్పాటుచేసిన ఈ పాఠశాలలో ప్రస్తుతం 110మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలను తలదన్నే రీతిలో బోధన చేస్తుండడంతో విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

బిహార్, ఉత్తరప్రదేశ్, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన వలస కూలీల పిల్లలు 25 నుంచి 30 మంది వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. వలస కూలీల పిల్లలకు అనువుగా విద్యాబోధన చేస్తున్నారు. ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు ప్రైవేట్ టీచర్స్ విద్యార్థులకు బోధనకు నియమించారు. వీరికి ప్రభుత్వ ఉపాధ్యాయులే నెలనెలా జీతాలు చెల్లిస్తూ మెరుగైన విద్యను అందించేందుకు దోహదం చేస్తున్నారు.

సుమారు 2 వేల గజాల విస్తీర్ణంలో...

సుమారు 2 వేల గజాల విస్తీర్ణంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇందులో మూడు తరగతి గదులతో పాటు ఒక స్టాఫ్ గదిని నిర్మించారు. ఐదు తరగతుల నిర్వహణకు గదులు సరిపడకపోవడంతో వరండాలలో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. కాగా, పాఠశాలకు ఒక అదనపు తరగతి గదిని నిర్మించేందుకు తన నిధుల నుంచి రూ.12 లక్షలను కేటాయిస్తున్నట్లు ఏడాది క్రితం ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రకటించారు. కానీ అమలుకు నోచుకోలేదు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే హర్షవర్ధన్‌రెడ్డి విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నారు. తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల సమాచారాన్ని ప్రతి రోజూ వారి తల్లిదండ్రులకు సెల్‌ఫోన్ ద్వారా తెలియజేయడం, ఫోన్ సౌకర్యం లేకుంటే నేరుగా వారి ఇళ్లకే వెళ్లి చెబుతుంటారు. చదువులో కొద్దిగా వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తుంటారు. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడం, తల్లి దండ్రులతో పాటు పెద్దలను గౌరవించడం వంటి ఉదాత్తగుణాలను ఆచరించేలా తయారుచేస్తున్నారు. చదువుతో పాటు వ్యక్తిగత ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు సత్ప్రవర్తనను అలవరచుకునేలా విద్యాబుద్ధలు నేర్పిస్తున్నారు. చదువుతో పాటు సంస్కారం అవసరమన్న సిద్ధాంతాన్ని అమలుచేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నాం. 10 రోజులుగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులలో చైతన్యాన్ని కల్పిస్తున్నాం. పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నాం. ఈ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న పట్టుదలతో పనిచేస్తున్నాం. పాఠశాలకు ఒక అదనపు తరగతి అవసరం ఉంది. ఈ గదిని నిర్మించేందుకు దివీస్ సంస్థ ముందుకు వచ్చింది. అదేవిధంగా ఖాళీగా ఉన్న ఒక టీచర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

- కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాద్యాయుడు

ఆహ్లాదకరమైన వాతావరణం

పాఠశాల ఆవరణ పచ్చనిచెట్లతో నిండి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తోంది. పాఠశాల ముందు భాగంతో పాటు లోపలిభాగంలో అందమైన పూలమొక్కలను పెంచుతున్నారు. 2024 ఆగస్టు 5న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నాటిన మొక్కలు పచ్చదనంతో అలరారుతున్నాయి. ప్రత్యేకంగా కృష్ణా వాటర్ సరఫరా సౌకర్యాన్ని కల్పించడంతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మన ఊరు(బస్తీ)-మన బడి పథకం కింద తీసుకున్న ఈపాఠశాలలో విద్యార్థులకు కబోర్డు బెంచీలను ఏర్పాటు చేశారు. పాఠశాల భవన సముదాయానికి అందమైన కలర్స్ వేయడంతో విద్యార్థులను ఆకర్షిస్తోంది.



పచ్చని చెట్ల మధ్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన సముదాయం

పాఠశాల చూడ ముచ్చటగా ఉండడంతో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తున్నారు.

నిప్పుతో చెలగాటం వద్దు

● అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)



అగ్నిప్రమాదాల నివారణపై జ్యోతి హస్పిటల్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

మండే ఎండలకు ఆపై నిప్పుతోడైతే జరిగే ప్రమాదాలు ఊహించడం కష్టం. ఇంటా, బయట నిప్పుతో వంట చేసేటప్పుడు, ఇతర సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలకేంద్రం సమీపంలో కృష్ణానదీ తీరం వెంట అటవీభూముల సరిహద్దుల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగిన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. వారం కిందట మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడెం వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో టిప్పర్ కాలిపోయింది. ఎండాకాలంలో చిన్న నిప్పురవ్వ సైతం దావానాలాన్ని సృష్టిస్తుంది. అగ్నిప్రమాదాల నివారణకు ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అధికారులు ఆర్టీసీ బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్స్, మల్టీప్లెక్స్‌లు కూడళ్ల వద్ద పోస్టర్లు, ఫ్లెక్సీల ద్వారా విరివిగా ప్రచారం చేయడమే కాకుండా వంట గ్యాస్ లీకేజీని ఎలా ఆపాలో ప్రత్యక్షంగా చేసి చూపడం ద్వారా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. ఆసుపత్రుల బిల్డింగ్స్‌లో అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా అందుబాటులో ఉంచుకోవాలని, చెత్తాచెదారం పోగుకాకుండా భవనాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్ట్‌లలో కాకుండా మెట్లమార్గాన్ని, ర్యాంప్‌లను ఉపయోగించాలని సూచిస్తున్నారు. పరిశ్రమలలో విద్యుత్ ఉపకరణాల పనితీరును తరచుగా పర్యవేక్షించాలని, చమురు గ్యాస్‌లీక్‌లను సమర్థంగా అరికట్టాలని, ఫైర్‌డ్రిల్లును ప్రతి మూడునెలలకోసారి నిర్వహించాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా తప్పించుకునే మార్గంపై పాఠశాల విద్యార్థులకు యాజమాన్యం అవగాహన కల్పించేలా చూడాలని కోరుతున్నారు. భద్రతపై అశ్రద్ధ, నిర్లక్ష్యం కూడదని హెచ్చరికలు చేస్తున్నారు. ఇళ్లలో వంట గ్యాస్‌లీక్ అయితే ఏంచేయాలి, అగ్నిప్రమాదం అయితే మన దగ్గర ఉన్న పరికరాలతో ఎలా ఆర్పాలి అనే విషయాలపై ప్రాక్టికల్‌గా చేసి చూపి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అగ్ని ప్రమాదాల సంఖ్య

మిర్యాలగూడ ఫైర్‌స్టేషన్ పరిధిలోని అడవిదేవులపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి, మాడ్గులపల్లి, త్రిపురారం మండలాల్లో 2022లో 70, 2023లో 93, 2024లో 90, 2025లో ఇప్పటివరకు 27 ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా నాలుగేళ్లలో అగ్నిమాపక సిబ్బంది నాలుగు సంఘటనల్లో రెస్క్యూ చేసి ప్రాణాలు కాపాడినట్లు అధికారులు తెలిపారు.

భద్రతపై నిర్లక్ష్యం వద్దు




అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెరగాలి. భద్రతపై నిర్లక్ష్యం పెద్దప్రమాదాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా పిల్లలను నిప్పుకు దూరంగా ఉండేలా చూడాలి. నివాస ప్రాంతాల చుట్టూ చెత్తాచెదారం లేకుండాచూడాలి. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే డయల్-101కు చేసి సమాచారమివ్వాలి.

ఎస్. యాదగిరి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, మిర్యాలగూడ

హైదరాబాద్ నుంచి సాగర్‌కు ప్రత్యేక బస్సు

● ప్రతి నెలా మూడవ ఆదివారం ఏర్పాటు

● టికెట్ ధర రూ.1000



నాగార్జునసాగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు పర్యాటకుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు పర్యాటక శాఖ గుర్తింపు పొందిన ప్రతిమ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీ కిశోర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మూడవ ఆదివారం ఈ సర్వీసులు నడపనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని సంగీత్ ఎక్స్ రోడ్డుకు ఉదయం 6 గంటలకు, ఉప్పల్ ఎక్స్ రోడ్డుకు ఉదయం 6:20 గంటలకు, ఎల్‌బీనగర్‌కు ఉదయం 6:35 గంటలకు, సాగర్ రింగ్ రోడ్డుకు ఉదయం 6:45 గంటలకు, అక్కడి నుంచి సాగర్‌కు ఉదయం 9 గంటలకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. సాగర్‌లో బుద్ధవనం, జలాశయం మధ్యలోని నాగార్జునకొండలను పర్యాటకులకు చూపిన అనంతరం రాత్రి 10 గంటల వరకు హైదరాబాద్‌కు బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. పర్యాటకుల సంఖ్యను బట్టి 22, 40సీట్ల బస్సులను నడుపుతామని, ఇందుకు టికెట్ ధరను రూ.1000గా నిర్ణయించినట్లు వివరించారు. ఈ ప్యాకేజీలో రవాణాతో పాటు బుద్ధవనం, నాగార్జునకొండకు బోటింగ్ టికెట్లతో పాటు మ్యూజియం టికెట్లు ఉంటాయని ఎండీ తెలిపారు. టిఫిన్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఖర్చులు ఎవరికి వారు భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ దర్శనీయ స్థలాలు, పురాతన బౌద్ధ క్షేత్రాలను దర్శించడానికి ఇది ఒక్క మంచి అవకాశమని, పర్యాటకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా ఊంజల్ సేవోత్సవం



అద్దాల మండపంలో ఊంజలీ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.28,94,394 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

మట్టపల్లిలో భక్తకల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యపూజలు అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో హైదరాబాద్-విజయవాడ మార్గంలో బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ నగరంలోని ప్రజలు, ప్రధానంగా సాఫ్ట్‌వేర్ సొంతూళ్లకు పయనమయ్యారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే, శనివారం, ఆదివారాలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వారాంతపు సెలవులు ఉండడంతో పట్టణం నుంచి పల్లెలకు బయలుదేరారు. దీంతో చౌటుప్పల్ పట్టణంలోని రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం నుంచే వాహనాలతో రద్దీ ఏర్పడింది. హైదరాబాద్ మహానగరంలో ఒత్తిడితో ఉండే ప్రజలు రెండు రోజులు సెలవులు దొరికితే చాలు ప్రశాంత వాతావరణంలోని పల్లెలకు పరుగులు తీస్తున్నారు. హైదరాబాద్‌కు చుట్టపక్కల 150 కిలోమీటర్ల వరకు సొంతూళ్లు ఉన్న ప్రజలు సమయం దొరికితే చాలు ఊర్లకు వెళ్లిపోతున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పనులు చూసుకొని తిరిగి పట్నం చేరుకుంటున్నారు.

ఉపాధ్యాయుడు లచ్చిరాంకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న లచ్చిరాం

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాం గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని నాంపల్లిలో సురవరం ప్రతాప్‌రెడ్డి(పొట్టి శ్రీరాములు) తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏసీయూ వేదిక్ ఇంటర్నేషల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ చైర్మన్ రమేశ్ ఆధ్వర్యంలో ఢిల్లికి చెందిన ఏసీయూ ఇంటర్నేషల్ కల్చరల్ యూనివర్సిటీ వారి నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. కరోనా సమయంలో చేసిన సేవలు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గుణాత్మక విద్యను అందించడం, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించడం, పర్యావరణం, మహిళా సాధికారిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వంటి వివిధ అంశాలలో లచ్చిరాంకు గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరాంనాయక్ మాట్లాడుతూ ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు బంధువులు, ఉపాధ్యాయులు, నాయకులు ఆయన్ను అభినందించారు. కాగా కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆకుల రమేష్, డాక్టర్ గూడురు చెన్నారెడ్డి, డాక్టర్ మల్లాది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెక్సాస్ రాష్ట్రస్థాయి పోటీల్లో కోదాడ విద్యార్థి ప్రతిభ

కోదాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని కేఎల్ఆర్ కాలనీకి చెందిన జలగం రంగారావు మనువడు జలగం వేదాన్ష్ (9వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అమెరికాలో ఈ నెలలో జరిగిన సైన్స్ పోటీల్లో స్కూల్ స్థాయి, కౌంటి స్థాయి, డివిజన్ స్థాయి దాటుకుని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మొదటి 10 స్థానాల్లో నిలిచినట్లు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. హెలికాప్టర్‌ను అనేక విడిభాగాలతో తయారీ చేసి దానిని కొన్నినిమిషాల పాటు ఆకాశంలో ప్రయాణించేలా చేయడంలో వేదాన్ష్ తన ప్రతిభను కనబరిచాడు. కాగా వరుసగా 2024, 2025 సంవత్సరాల్లో రెండు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించడంతో తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం వేదాన్ష్‌ను అభినందించారు.



జలగం వేదాన్ష్

మొదటి నుంచి సామాజిక స్పృహ

వేదాన్ష్ కొంతకాలం కోదాడ మండలం వెంకట్రామపురం ప్రాథమిక పాఠశాలలో, హైదరాబాద్‌లోని ప్రైవేటు స్కూల్‌లో చదివాడు. వెంకట్రామపురం స్కూల్ పరిస్థితి మీద అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరికి లేఖ రాసి ఆ స్కూల్‌లో వసతుల కల్పనకు కృషి చేశాడు. గతంలో గ్రే మేటర్ అనే పరీక్షల్లో హైదారాబాద్ టాపర్‌గా నిలిచి తనకు వచ్చిన ప్రైజ్‌మనీ రూ.5 వేలను ఆర్మీ వెల్ఫేర్‌కు పంపించాడు. తన ఇంటిపక్కనే స్కూల్ బస్ ఆగే దగ్గర బహిరంగ మలమూత్ర విసర్జనకు వ్యతిరేకంగా గాంధీగిరితో ఫ్లెక్సీ ఏర్పాటుచేసి గులాబీ పూలను వారికిచ్చి తన నిరసన తెలపడంతో జీహెచ్ఎంసీ వారు స్పందించి అక్కడ టాయిలెట్ ఏర్పాటు చేశారు. అమెరికాలో తాను చదువుకున్న బడిలో ఉండే కాఫీ విత్ ప్రిన్సిపాల్ కార్యక్రమం, మినీ లైబ్రరీలు కోదాడ ప్రాంతంలో తన తండ్రి ద్వారా ఏర్పాటు చేయించటంలో కీలకపాత్ర పోషించాడు. కోదాడ ప్రాంతంలోని వ్యవసాయం, గీతకార్మికుల, వడ్రంగి, కుమ్మరి, చేపలు పట్టడం లాంటి అనేక వృత్తులపై ప్రైమరీ స్కూల్ దశలోనే అధ్యయనం చేశాడు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

● సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ


ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు నకిలీ విత్తనాల విషయం లో అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాల వల్ల ఒక్క రైతు నష్టపోకూడదని, నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. డీలర్లు నాణ్యమైన విత్తనా లు విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, సరఫరా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి పీడీ యాక్టు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా ఆంధ్రప్రదేశ్ సరిహద్దున ఉన్నందున ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు సరఫరా అయ్యే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ మేరకు జిల్లా సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్న వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. తక్కువ ధరకు విత్తనాలు విక్రయిస్తామనే వారి మాటలు రైతులు నమ్మవద్దని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి


పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ పి.వీరరాఘవులు అన్నారు. శుక్రవారం రాత్రి ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు మధ్య ఉన్న సూర్యాపేట పట్టణంలో మెరుగైన భద్రత కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా జరగకుండా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అపరిచిత, అనుమానిత వ్యక్తుల కదలికలు కూడా తనిఖీల ద్వారా గుర్తించే అవకాశం ఉందన్నారు. గుర్తింపు లేని వ్యక్తులకు ప్రజలు ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. అదే విధంగా లాడ్జీల యజమానులు గుర్తింపు కార్డులు లేకుండా గదులు అద్దెకు ఇవ్వవద్దని, లాడ్జీలకు వచ్చిన వారిపై ఏమైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా హైటెక్, న్యూబస్టాండ్‌తో పాటు రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐలు ఆంజనేయులు, ఆర్ఎస్ఐ మహేష్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

పిడుగుపాటుకు 50 మూగజీవాల మృతి


మృతి చెందిన మేకలు, గొర్రెలు

రాజాపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రాజాపేట, బొందుగుల, నెమిల, రేణికుంట, పారుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలుల వర్షం కురిసింది. మండలంలోని రేణికుంట, నెమిల గ్రామాల్లో పిడుగులు పడ్డాయి. నెమిలలో తాటిచెట్టు పై పిడుగుపడటంతో పూర్తిగా దగ్ధమైంది. రేనికుంటలో బండి పుల్లయ్యకు చెందిన గొర్రెల మందపై పిడుగు పడటంతో 40 మేకలు, 10 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. పిడుగు పడిన సమయంలో మల్లయ్య మందకు దూరంగా ఉండటంతో ప్రమాదం నుంచి నుంచి తప్పించుకున్నారు. గొర్రెల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో ఆవు దూడ...

చందంపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): విద్యాదాఘాతంతో ఆవు దూడ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్‌దేవరపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు వాంకునావత్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆవు దూడను మేత కోసం పొలాలకు తోలుకెళ్లాడు. వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో విద్యుత్ వైర్లు ఆవు దూడకు తగిలాయి. దీంతో ఆవు దూడ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు దూడ విలువ రూ.35వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ధాన్యం ఆరబోస్తూ రైతు మృతి

● ఐకేపీ కేంద్రంలో విషాదం ● సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో ఘటన


నూతనకల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తూ ఓ రైతు మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఈదులకంటి భిక్షంరెడ్డి (65) రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల పొలం కోయడంతో ధాన్యాన్ని సమీప గ్రామమైన నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రానికి తీసుకువచ్చాడు. ధాన్యం పచ్చిగా ఉండటంతో శుక్రవారం ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని డబ్బాతో ఆరబోస్తుండగా అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న రైతులు 108 వాహనానికి సమాచారం అందించి సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు భిక్షంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎండకు తాళలేక మృతి చెందాడని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఇద్దరు యువకుల బలవన్మరణం

నల్లగొండ జిల్లాలో శుక్రవారం ఇద్దరు యువకులు బలవన్మరణం చెందారు. మనస్తాపంతో ఒకరు ఉరి వేసుకొని ఒకరు, తండ్రితో జరిగిన గొడవతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.

నాంపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటంపేట గ్రామానికి చెందిన యువకుడు నాంపల్లి మండలంలోని కేతేపల్లి శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... చింతపల్లి మండలంలోని వెంకటంపేట గ్రామానికి చెందిన సండే హనుమంతు (25) తల్లి దండ్రులు మృతి చెందారు. దీంతో అతను ఇంటి వద్ద ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. తనకు ఎవరూ లేరనే మనోవేదనతో కేతేపల్లి గ్రామశివారులో వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహం వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. మృతుడు హనుమంతు చెల్లెలు చెరుకుపల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగి....


కొండయ్య (ఫైల్‌ఫొటో)

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలో ద్విచక్ర వాహన విషయంతో తండ్రితో జరిగిన వివాదంతో క్షణికావేశంలో ఓ యువకుడు క్రిమి సంహారక మందు తాగి తనువు చాలించాడు. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భీమనపల్లి వెంకటయ్య, వెంకటమ్మ దంపతులకు కొండయ్య (32) ఏకైక కుమారుడు. నాలుగేళ్ల క్రితం కొండయ్యకు వివాహం చేయగా భార్యతో నెలకొన్న వివాదంతో ప్రస్తుతం ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ద్విచక్ర వాహన విషయంలో కొండయ్యకు తండ్రి వెంకటయ్యతో వివాదం జరిగింది. దీంతో కొండయ్య ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు కొండయ్య తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోదాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట సమీపంలోని మల్కాపురం వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ డ్రైవర్లు అంబోజి నాగేంద్రబాబు, అంబోజి కృష్ణయ్య కోదాడకు తరలిస్తున్నారు. కోదాడ సమీపంలో పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

అధిక వడ్డీ పేరిట బడా మోసం

- విప్స్ యాప్‌తో కుచ్చు టోపీ
- కోట్లలో పెట్టుబడులు పెట్టిన అమాయకులు
- మోసపోయామని తెలిసి పోలీసులకు ఫిర్యాదు


నల్లగొండ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితులు

నల్లగొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ పేరిట బడా మోసం జరిగింది. అమాయకుల ఆశలను ఆసరాగా తీసుకొని నిలువునా ముంచారు. విప్స్ యాప్ పేరిట మహారాష్ట్రలోని పూణె కేంద్రంగా ఈ విప్స్ యాప్‌ను 2018 సంవత్సరంలో ప్రారంభించినట్లు తెలుస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడుతూ ప్రజలను నిలువునా ముంచిన సదరు సంస్థ హైదరాబాద్‌లో కూడా మొదలు పెట్టి జిల్లాల్లో బ్రాంచీలను ప్రారంభించారు. ఈ క్రమంలో నల్లగొండలో కూడా బ్రాంచీ ఓపెన్ చేయడంతో దాదాపు 300మంది ఈ కంపెనీ గ్రూపులో చేరారు. ఉమ్మడి జిల్లాలో 700 మంది వరకు సభ్యులు ఉన్నట్లు సమాచారం. యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని అమాయకులను బురిడీ కొట్టించారు. ఈ మోసపోయిన వారిలో సాధారణ ప్రజలతో పాటు పోలీసులు కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒకరి ద్వారా ఒకరూ చైన్ సిస్టమ్‌లో పెట్టుబడులు పెట్టారు. సంవత్సరం, రెండేళ్ల పాటు వడ్డీ సక్రమంగా ఇచ్చి నమ్మపలికిన నిర్వాహకులు కొన్ని నెలలుగా చేతులు ఎత్తివేయడంతో బాధితులు మోసపోయామని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డిని బాధితులు అధిక సంఖ్యలో ఆశ్రయించి తమకు జరిగిన నష్టాన్ని రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉదాహరణకు లక్ష రూపాయల నగదును వ్యాపారంలో పెడితే నెలకు రూ.3ను వడ్డీగా ఆశ చూపించారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు తమకు ఉన్న పాటి ఆస్తులను సైతం అమ్ముకుని పెట్టుబడులు పెట్టారు. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బు వస్తుందన్న ఆశతో అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టారు. కొన్ని నెలలుగా వడ్డీ రాకపోవడంతో పాటు యాప్‌ను కూడా బ్లాక్ చేయడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదుతో నల్లగొండ పోలీసులు పూణెలోని నిర్వాహకులను సంప్రదించడంతో రెండేళ్లలో ఇబ్బందులు తొలగిపోతాయని, ప్రతి ఒక్కరికి బాండ్ ఇస్తామని నమ్మపలికినట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు రెండు రోజుల్లో బాధితులకు న్యాయం చేయకపోతే శాఖాపరంగా, చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తుంది. ఏజెంట్లు, డైరెక్టర్ల మాటలు నమ్ముకొని నల్లగొండ పట్టణంతో పాటు నల్లగొండ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో అనేక మంది అమాయకులు విప్స్ యాప్‌తో మోసపోయినట్లు స్పష్టం అవుతుంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

● పలువురికి తీవ్ర గాయాలు

సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ద్విచక్ర వాహనాలకు జరిగిన ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

గరిడేపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవా రం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ద్విచక్ర వాహనంపై సుమారు 28 సంవత్సరాలు ఉన్న ఓ గుర్తు తెలియని యువకుడు హుజూర్‌నగర్ వైపు నుంచి గరిడేపల్లి వైపు వెళ్తున్నాడు. మండలంలోని అప్పన్నపేట గ్రామశివారులో ఎదురుగా వస్తు న్న కారు ఢీకొట్టింది. దీంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం సూర్యాపేట ఏరియా హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెం దాడు. మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని కోదాడ మార్చురీకి త రలించారు. ప్రమాద విషయమై పోలీసులను వివరణ కోరగా మృతుడికి సంబంధించిన ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

ట్రాలీ ఆటో, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

మోటకొండూరు: ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ట్రాలీ వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వర్టూరు గ్రామానికి చెందిన పల్లె సోమేశ్వర్ తన ద్విచక్ర వాహనంపై మోటకొండూరు నుంచి సొంత గ్రామం వర్టూరుకు బయలుదేరాడు. మండల కేంద్రంలోని దుర్గమ్మ దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనాన్ని ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. దీంతో సోమేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో తరలించి ప్రథమ చికిత్స చేశారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సోమేశ్వర్ తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ...

అనంతగిరి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అనంతగిరి మండలం అనురాగ్ కాలేజీ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడ్‌ఫ్రైడే సందర్భంగా కోదాడ పట్టణానికి చెందిన శ్యాంసుందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై త్రిపురారం గ్రామంలో ప్రార్థనల్లో పాల్గొనడానికి బయలుదేరాడు. మండలంలోని అనురాగ్ కాలేజీ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్యాంసుందర్, అతని భార్య రజిత, పిల్లలు శ్రేష్ఠ శరణ్య, అభిషేక్, హరిక్‌లకు గాయాలయ్యాయి. శ్యామ్‌సుందర్ అన్న కాసర్ల రాజు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మండల శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.


కోదాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జీతాలూ, అద్దెలు లేవ్

(5వపేజీ తరువాయి)

3,280మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి, గత నెల జీతం రూ.26.24 కోట్లు నేటికి అందకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదనేది సమాచారం. గత ఏడు, ఎనిమిది నెలలుగా, నెలనెలా జీతాలు సక్రమంగా అందక ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులుపడుతున్నట్లు సమాచారం. ఈ విద్యాసంవత్సరం పూర్తి అయ్యే నాటికి గురుకులాల అద్దెలు, వాటిలో పనిచేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ జీతాలు ఇచ్చి, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపు సొంత భవనాలు నిర్మించాలని, నెలనెలా జీతాలు ఇచ్చి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ఉపాధ్యాయులు సొసైటీ నిర్వాహకులను కోరుతున్నారు.

సగానికిపైగా అద్దె వాటిలోనే..

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ గురుకులాలు 18 ఉన్నాయి. వాటిలో ఎనిమిది అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. బీసీ 26 ఉండగా, 26 అద్దె భవనాల్లో, ఎస్టీ గురుకులాల 20 ఉండగా, వాటిలో 5 అద్దె భవనాల్లో, మైనార్టీ 16ఉండగా వాటిలో 11 అద్దె భవనాలలో నడుస్తున్నాయి. సాధారణ గురుకులాలు రెండు ఉండగా, రెండింటికీ సొంతభవనాలు ఉన్నాయి. మొత్తంగా 82 గురుకులాలు ఉండగా, వాటిలో 55 గురుకులాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఒక్కో భవనం అద్దె సగటున రూ.3.50 లక్షలు ఉన్నట్లు సమాచారం. ఆ చొప్పున 55 గురుకులాలకు చెల్లించాల్సిన అద్దె నెలకు రూ.1.92 కోట్లు. ఏడు నెలలుగా బకాయి మొత్తం రూ.13.47 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మైనార్టీ గురుకులాలకు 11 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. అంటే మైనార్టీ గురుకులాలకు మరో నాలుగు నెలల అద్దె రూ.14లక్షలు ఇవ్వాల్సి ఉంది. విద్యా సంవత్సరం పూర్తవుతున్నా అద్దెలు అందకపోవటంపై భవన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈఎంఐలు ఎక్కడ నుంచి తెచ్చి కట్టాలని వారంటున్నారు. కోట్లు పెట్టి భవనాలు నిర్మిస్తే, ప్రభుత్వం నెలవారీగా అద్దెలు చెల్లించకపోవటంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా బకాయిలు ఇచ్చి, నెలనెలా అద్దెలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అందని రూ.26 కోట్ల వేతనాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 82 గురుకులాల్లో 52,480మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో గురుకులంలో 32 మంది టీచింగ్, ఎనిమిది మంది నాన్‌టీచింగ్, మొత్తం 40 మంది పనిచేస్తున్నారు. ఆ చొప్పున 82 గురుకులాల్లో 3,280 మంది పనిచేస్తున్నారు. గత నెల వరకు వారికి జీతాలు రూ.26 కోట్లు అందాల్సి ఉంది. ఈ నెల 20 రోజులు గడుస్తున్నా మార్చి నెల జీతం నేటికీ అందకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి నెలనెలా జీతాలు అందడంలేదని రెండు, మూడు నెలలకు ఒకసారి వస్తుండటంతో పస్తులతో తాము పనిచేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, సౌకర్యాలు అందాలంటే సిబ్బందికి నెలనెలా జీతం అందేలా, సొసైటీ వారు ప్రణాళిక సిద్ధం చేసుకొని, వచ్చే విద్య సంవత్సరంలోనైనా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.

డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకూ అందని వేతనాలు

కనగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఎస్టీటీలుగా నియమితులైన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 157 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం గత ఫిబ్రవరి 15న కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించింది. వీరికి రూ.31వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఉద్యోగంలో చేరి రెండునెలలైనా వేతనాలు ఇంకా అందలేదు. ఉద్యోగంలో చేరక ముందు ప్రైవేట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తుండగా, రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఉద్యోగంలో చేరామని వారు సంబరపడ్డారు. అయితే ఉద్యోగంలోకి చేరాక వేతనాలు అందకపోవడంతో వారి సంతోషం ఆవిరైంది. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ కింద పడి రైతు దుర్మరణం


రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

గుండాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... బండకొత్తపల్లి గ్రామానికి చెందిన గంగాపురం రామకృష్ణ (43) తనకున్న నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వారం రోజుల క్రితం రెండు ఎకరాలు కోత కోశాడు. గురువారం రాత్రి మిగిలిన రెండు ఎకరాల పొలాన్ని మిషన్‌తో కోత కోయించాడు. ధాన్యాన్ని తన ట్రాక్టర్‌లో గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించాడు. ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పోసిన తర్వాత తిరిగి వెళ్తుండగా ట్రాక్టర్ ధాన్యం రాశులు ఎక్కడంతో రామకృష్ణ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కింద పడ్డాడు. దీంతో ట్రాక్టర్ ట్రక్కు టైరు తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన రైతులు ఐకేపీ కేంద్రానికి వచ్చే సరికి రామకృష్ణ మృతి చెందినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు పాల్గొన్నారు. మృతుడు రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

జీతాలు రాక.. వెతలు తీరక

- మూడు నెలలుగా కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న శ్రమజీవులు
- భారంగా మారిన కుటుంబ పోషణ


పనులు చేస్తున్న కూలీలు

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో క్రియాశీలక పాత్ర వహిస్తున్న కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని వేతనాల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. పనుల ఎంపిక, కూలీలు హాజరయ్యేలా వారిలో చైతన్యం తీసుకరావడం, రిజిస్టర్లలో వివరాల నమోదు వంటి పనులు చేపడుతున్నారు. పథకంలో పక్కాగా నిర్వహించేందుకు ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)ను గత ఆర్థిక సంవత్సరం ప్రారంభించింది.

కేటగిరీలుగా విభజించి

ఫీల్డ్ అసిస్టెంట్లు పనులకు వచ్చిన కూలీల పేర్లు నమోదు చేసుకుని వారి ఫొటో తీసి యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. పని పూర్తయిన తర్వాత మరో దఫా చిత్రం తీసి అందులో పొందుపరిచి బాధ్యతలు వారికి అప్పగించారు. ఇలాంటి వాటిని చేపడుతున్నా సకాలంలో జీతాలు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పని దినాలు కల్పించిన వారికి కేటగిరీలుగా విభజించారు. అత్యధిక కేటగిరీ వారికి నెలకు రూ.12,200, రెండో దశ ఎఫ్ఏలకు రూ.9వేలు, మూడో కేటగిరీ చెందిన ఎఫ్ఏలకు రూ.7,700 వేతనం నిర్ణయించారు.

14 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

ఉమ్మడి పీఏపల్లి మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో 14 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వారికి జనవరి, ఫిబ్రవరి, మార్చి(నెలల) వేతనాలు అందాల్సి ఉంది. ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని మండలంలోని ఎఫ్ఏలు కోరుతున్నారు. మరో వైపు 8వేల మంది కూలీలుండగా అందులో 4,200 పనులు చేస్తున్నారు. వీరికి సైతం వేతనాలు అందలేదు.

వేతనాలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేసి సిబ్బంది ఎదుర్కొంటు న్న ఇబ్బందులు తొలగించాలి. రెగ్యులర్‌గా జీతాలు అందకపోవడంతో కుటుంబపోషణ ఇబ్బందిగా మారింది. అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ గా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

\- గోలి రవి, ఎఫ్ఏ, గుడిపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



గ్రామాల్లో ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. ఉపాధిహామీ సిబ్బందిలో టెక్నికల్ అసిస్టెంట్లకు మినహా మిగతా వారికి సంబంధించిన వేతనాలు మూడు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం.

\- ఎం.శ్రీనివాస్, ఏపీవో, పీఏపల్లి

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని శాలిగౌరారం పశువైద్యశాఖ వీఏఎస్ కె.సైదులు కోరారు. శాలిగౌరారంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర గండూరి విజయలక్ష్మి, మైత్రి కవిత, రైతులు పాల్గొన్నారు.

దర్వేశిపురంలో భక్తుల రద్దీ

కనగల్, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారంభక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అలయ ప్రదీక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడి బియ్యం బోననైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించుకున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బందులు పడుతున్న చండూరు ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారి పక్కనే కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

చండూరు మునిసిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రోజుల తరబడి మురుగు నీటికాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగుకాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

- (ఆంధ్రజ్యోతి-చండూరు)

పట్టణంలో ప్రధానచౌరస్తా గుండ్రపల్లి ఎక్స్ రోడ్డు వద్దనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. విద్యార్థులు చదవుకునే గదుల పక్కనే మురుగు కాల్వ పారుతోంది. పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టిన క్రమంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు బయటికి వదిలేయడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి.రోజుల తరబడి వ్యర్థాలను తొలగించకపోవడంతో పరిసరాలు అంతా దుర్గంధంగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో అటువైపు వెళ్లలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాల్సిన అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. మునిసిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పారిశుధ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల్లో ఫాగింగ్ యంత్రాలు

మునిసిపాలిటీలో ఫాగింగ్ యంత్రాలు రెండు ఉండగా, ఒకటి కొంత కాలంగా మరమ్మతులు చేయకపోవడంతో వృథాగా పడి ఉంది. మరొకటి కూడా పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో కొన్ని నెలల క్రితం అడపాదడపా మాత్రమే కొన్ని వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా మారని తీరు

మార్చి 2న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చండూరు మునిసిపాలిటీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రితోపాటు, బాలికల హాస్టల్ పరిసరాల్లో దోమలు అధికంగా ఉన్నాయని గమనించి, అనవసరమైన మొక్కలు తొలగించి ఫాగింగ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించినప్పటికీ, ఒక్కరోజు మాత్రమే ఫా గింగ్ చేశారని మరోసారి చేయమని అడిగితే పట్టించుకోలేదని సిబ్బంది చెబుతున్నారు. కలెక్టర్ పర్యటన ముగిసి నెల రోజులు గడిచినప్పటికీ అధికారులు ఆమె ఆదేశాలు పట్టించుకోవడం లేదని ప్రజ లు ఆరోపిస్తున్నారు.



4వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురునీరు

ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది



గుండ్రపల్లి ఎక్స్ రోడ్డు వద్ద వ్యర్థాలతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వస్తుంది. దుర్వాసనతో పని చేసుకోలేకపోతున్నాం. మునిసిపాలిటీ సిబ్బంది, అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలి. రాత్రి సమయాల్లో దోమల బెడద చాలా ఎక్కువైంది. కొన్ని నెలలుగా దోమల మందు కూడా కొట్టడం లేదు.

- ఇరిగి రామకృష్ణ, 4వ వార్డు,

దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



దోమల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి దోమలు వృద్ధి చెందకుండా చూడాలి. విష జ్వరాలు ప్రబ లే అవకాశం ఉంది. అన్ని వార్డుల్లో వెంటనే ఫాగింగ్ చేయాలి.

- రుద్ర రామలింగం, 5వ వార్డు, స్థానికుడు

సిబ్బందితో శుభ్రం చేయిస్తాం



పట్టణంలో పేరుకుపోయిన వ్యర్థాలను తమ సిబ్బందితో తొలగిస్తాం. నాలాల వద్ద వ్యర్థాలు పేరుకోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం. పట్టణంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపిస్తాం. ఎ క్కడైనా వ్యర్థాలు నిల్వ ఉంటే ఆ కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

- పుష్పలత, మునిసిపల్ కమిషనర్, చండూరు

పీఏసీఎస్ చైర్మన్‌కు గుత్తా పరామర్శ



రాములమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 18,(ఆంధ్రజ్యోతి): కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహాదేవ రెడ్డి తల్లి రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం వారి స్వగ్రామం లచ్చుగూడెంలోని రాములమ్మ ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీజడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, నాయకులు కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, బల్గూరిమల్లయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.

భక్తి భావం కలిగి ఉండాలి : ఎమ్మెల్యే వీరేశం



రేణుకాఎల్లమ్మ ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లిలో అశోక్‌స్వామి నిర్మించనున్న రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం జరిగిన భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెరిపోతుల భరత్, నట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, వేముల నర్సింహ, రాధారపు భిక్షపతి, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, గడ్డం పశుపతి, బింగి మహేశ్, బొంబాయి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



చిట్యాలలో రైతులతో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనెసంచుల కొరత లేకుండా చూడాలని, తూకం అయిన ధాన్యం త్వరగా రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, బొబ్బల సుధాకర్‌రెడ్డి, లడే రాములు, గుడిసె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు

రామగిరి, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నేతలపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం డీఎస్పీ శివరాంరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికై దేశ సేవలు చేస్తున్న ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మంత్రి కోమటిరెడ్డి అనుచరులు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అబ్బగోని రమేష్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ విచారణలో భాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై కేసులు పెడితే ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టుకుంటూ వస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతేపాక లింగస్వామి, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత ముత్యాలరావు, జిల్లా కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, మిర్యాల వెంకటేశం, రమణ, మంగలపల్లి కిషన్, కొత్తపల్లి ప్రమోద్, దాసరి వెంకన్న, భిక్షంరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మ దహనం

నార్కట్‌పల్లి: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొర్వి శంకర్, ముంత నర్సింహ, గణేశ్, శ్రీనివాస్, రామలింగం, నాగరాజు, రవి, పార్థసారథి, తిరుమలేశ్, పాల్గొన్నారు.

నర్రా ప్రవీణ్‌రెడ్డికి విపంచి పురస్కారం



విపంచి పురస్కారాన్ని అందుకుంటున్న నర్రా

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విపంచి ఫౌండేషన్ ప్రతీ యేటా వర్ధమాన సాహిత్యకారులకు ఇచ్చే పురస్కారాన్ని నార్కట్‌పల్లికి చెందిన యువకవి, తెలుగు ఉపన్యాసకుడు నర్రా ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం అందుకున్నారు. తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరా బాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పురస్కారానికి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నామోజు బాలచారి, అభినయ శ్రీనివాస్, దరువు అంజన్న, నక్కీర్తి శ్రీనివాస్, ఎన్.లక్ష్మణ్‌రావు, కూర రఘువీర్, గా దె వినోద్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, నర్సింహా చారి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- జిల్లా కేంద్రంలో ఆకట్టుకున్న ఏసుకు శిలువ వేసే ఘట్టాలు



నల్లగొండ పట్టణంలో నిర్వహించిన శిలువ సన్నివేశ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు జిల్లా కేంద్రంలోని అన్ని చర్చీలలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అన్ని చర్చిలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని క్రైస్తవులు ఏసుక్రీస్తుకు శిలువ వేసిన ఘట్టాన్ని ఏసుక్రీస్తు వేషధారణలో ఉన్న క్రైస్తవుడి భుజంపై శిలువను ఎత్తి పురవీధుల్లో ప్రదర్శించారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఎందుకు శిలువ వేయబడ్డాడో తెలిపే విధంగా క్రైస్తవులు వివిధ వేషదారణలతో కళ్లకు కట్టినట్లుగా నాటకాన్ని ప్రదర్శించారు. క్లాక్‌టవర్ సెంటర్‌లోని సెంటినరీ స్వపోషణ తెలుగు బాప్టిస్టు చర్చిలో శిలువపై ఏసు పలికిన సప్త వాక్కుల అంతర్యాన్ని పలువురు వివరించారు. వేడుకల్లో సంఘాధ్యక్షుడు క్రిస్టఫర్, సంఘ పెద్దలు మాణిక్యం, కృపానందం, విలియమ్స్, ఆశయ్య, అబ్షలోం, దుబ్బ ఆనంద్ ఆపాల్గొన్నారు.

క్రీస్తు ప్రేమ మార్గాన్ని చూపారు



కేతేపల్లిలో చర్చి వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఏసు క్రీస్తు శిలువపై తాను పడిన కష్టాలు, తాను పలికిన ఏడు మాటలు సర్వ మానవాళికి ప్రేమమార్గాన్ని చూపాయని పీఠాధిపతి కరుణం ధమన్ కుమార్ అన్నారు. స్థానిక దేవరకొండ రోడ్డు లోని మరియరాణి కెథెడ్రల్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, విచారణకర్తలు జోసఫ్‌రెడ్డి, జగ్జీవన్, జీవన్ కుమార్, చర్చి పెద్దలు పసల శౌరయ్య, శౌరి రాజు, బాలశౌరి, ప్రకాష్, ప్రేమ్ కుమార్, కిరణ్, జోసఫ్, కిషోర్, ఆరోగ్యం పాల్గొన్నారు.

- కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల, రాయపురం, కేతేపల్లి, భీమారం, చెరుకుపల్లి, కొప్పోలు, తుంగతుర్తి గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏసు క్రీస్తు సిలువ వేయబడి, యూదు సైనికుల కొరడా దెబ్బలు భరిస్తూ ఏసుక్రీస్తు సిలువ మోసిన సంఘటనలను స్ఫూరింపజేస్తూ ఆయా గ్రామాల్లో పవిత్ర శిలువ మార్గం ఊరేగింపులు జరిపారు. కేతేపల్లి జపమాల మాత చర్చి ఫాదర్ ఫ్రాంచీస్ శిలువ మార్గంలో ప్రార్థనలు జరిపారు.
- కట్టంగూరు : కట్టంగూరు, చిన్నపురి, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల గ్రామాల్లో గల చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నపురిలో శిలువ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గ్రెగోరి, శాంసన్, కొంక ప్రవీణ్ కుమార్ , అలెగ్జాండర్, మారయ్య, రాయప్ప, ప్రసాద్, చెరుకు శ్రీనివాస్, భాస్కర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

శాలిగౌరారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మనిమద్దె గ్రామపంచాయతీ కార్యదర్శి పర్వ తం కృష్ణ అన్నారు. మండలంలోని మని మద్దె గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కృష్ణ మాటాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తగినంత నీరు తాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ట్రాక్టర్ యజమానులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కట్టంగూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని ఎంఈవో అంబటి అంజయ్య మండల కేంద్రంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాల 26వ వార్షికోత్సవం శుక్రూరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత సాయికి ఎదిగేలా సన్నద్ధ చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల డ్యాన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీ ప్రకాశ్, సుప్రద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గంజి మురళీధర్, కొండ వెంకన్న, తదితరులు

నల్లగొండరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో ఆరు నెలలుగా గీతకార్మికులపై విధించిన సాంఘిక బహిష్కరణను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద శుక్రవారం నల్ల బ్యానర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా ఆలయం నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, అనురాధ, సరోజ, రవీందర్, గోపాల్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీతో వెతలు

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. పీహెచ్‌సీలలో నర్సులపై పనిభారం తగ్గించే నిమిత్తం, నియామకాలు జాప్యమైతే, అప్పటివరకు జీజీహెచ్‌లు, డీఎంహెచ్‌వోలు, టీజీవీవీపీల నుంచి రేషనలైజేషన్ ద్వారా సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులు నియామకాలు, ఈ సర్దుబాటు ప్రక్రియను చేపట్టకుండా ఉన్న వారిపైనే పనిభారం మోపుతూ కాలయాపన చేస్తున్నారు. ఈ నియామకాలు జరగకుండా ఉండేందుకు కొన్ని సంఘాలు, కొందరు సంఘ నాయకులు బలంగా అడ్డు పడుతున్నారని నర్సులు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు వెట్టిచాకిరీ తప్పడం లేదని వారు వాపోతున్నారు. రేషన్‌లైజేషన్ జరిగితే శాఖపైన తమ పట్టుతప్పుతుందనే భావనలో ఉన్న అధికారులు, ఉద్యోగులు దీనిని అడ్డుకుంటున్నట్లు నర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. నర్సుల నుంచి పదే పదే వస్తున్న విజ్ఞప్తుల మేరకు కొందరు డీఎంహెచ్‌వోలు, 24 గంటల పీహెచ్‌సీలలో ముగ్గురు నర్సులు ఉన్న చోట అదే పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై తీసుకుని, ఇక్కడ బాధ్యతలు అప్పగించాలని పీహెచ్‌సీల మెడికల్ అధికారులకు సర్క్యులర్ ఇచ్చినా, మెడికల్ అధికారులు మాత్రం వాటిని అమలు చేయడం లేదు. పైగా ముగ్గురు నర్సులు మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నారని, పని ఒత్తిడి ఏముందని దబాయిస్తున్నారని పలువురు నర్సులు వాపోతున్నారు. నర్సులకు వారంలో 40 గంటల పనితో పాటు, ఓవర్ టైమ్ చేస్తే, డేఆఫ్ ఇవ్వాలని, ఇంకా నర్సుల సంక్షేమం పేరుతో కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కనీసం జిల్లాల్లో అమలు చేయడం లేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి నర్సుల పని ఒత్తిడి, జీవో నెం.142 అమలు అంశాలను రాకుండా కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు పీహెచ్‌సీలలో పని చేసే నర్సుల పని ఒత్తిడిని గుర్తించి, ప్రభుత్వానికి నివేదించాలని, తద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని నర్సులు కోరుతున్నారు. పీహెచ్‌సీలలో అయిదుగురు నర్సుల చొప్పున నియామకాలైనా చేపట్టాలని, లేకపోతే జీవో నెం.142 అయినా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు నర్సింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.


పేదల పక్షాన వందేళ్లుగా పోరాటాలు : సీపీఐ



మునుగోడులో సీపీఐలో చేరిన వారితో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పల్లా వెంకట్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, పేదల హక్కుల కోసం వారి పక్షాన వందేళ్లుగా ప్రజా పోరాటాలు నిర్వహించిన చరిత్ర సీపీఐ పార్టీదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని కిష్టాపురం, చీకటిమామిడి, రావిగూడెం గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన సుమారు 50మంది సీపీఐలో చేరారు. వారికి ఎమ్మెల్సీ సత్యం పల్లా వెంకట్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటాలు నిర్వహించడంలో తమ పార్టీ ముందు వరుసలో ఉంటుందని గుర్తు చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వారి సంక్షేమాభివృద్ధి కోసం తమ పార్టీ పాటుపడుతోందన్నారు. పేదవర్గాల అభివృద్ధే ఏకైక నినాదంతో కష్టజీవులకు మద్దతుగా తమ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న నీటి వనరుల సాధన కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, పీపీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, అంజాచారి, తీర్పారి వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, నురిగి చలపతి, లాలు పాల్గొన్నారు.


వైభవంగా సీతారామచంద్ర స్వామి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

మునుగోడు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమస్తాన్‌పల్లి గ్రామ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మునుగోడు కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నరసింహాగౌడ్,రమాదేవి దంపతులు స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతిథులకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్ పంతంగి స్వామి పద్మ, జాజుల స్వామి గౌడ్, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.2




రోప్‌వే పిల్లర్ నిర్మాణానికి సాయిల్ టెస్టింగ్ చేస్తున్న కార్మికులు

భువనగిరి ఖిల్లా రోప్‌వే పనులకు టెండర్ల గ్రహణం వీడింది. రెండు ప్యాకేజీలుగా పిలిచిన టెండర్లలో రోప్‌వే పనులకు సంబంధించిన టెండర్లు ఖరారయ్యాయి. మిగతా పనులకు సంబంధించిన టెండర్‌కు ఈ నెల 25వ తేదీతో బిడ్ల దాఖలు గడువు పూర్తికానుంది.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

భువనగిరి ఖిల్లా రోప్‌వేకు టెండర్లు ఖరారు



- మిగతా పనులకు త్వరలో..
- రూ.56.81కోట్ల విలువైన పనులు రెండు ప్యాకేజీలుగా విభజన

స్వదేశీ దర్శన్ 2.0కు ఎంపికైన భువనగిరి ఖిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించింది. ఈ మేరకు మొదటిదశలో రూ.56.81కోట్లు విడుదల కాగా, ఆ నిధులతో రోప్‌వే సహా ఇతర అభివృద్ధి పనులకు ఒకే ప్యాకేజీగా ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో రాష్ట్ర పర్యాటకశాఖ మార్చి మూడో వారంలో టెండర్లు పిలిచింది. కానీ అంచనాల రూపకల్పనలో వాస్తవికత లోపించిందనే కారణంతో కాంట్రాక్టర్లు టెండర్ బిడ్స్ దాఖలు చేయలేదు. దీంతో అవే నిధులతో పనుల అంచనాలను సవరించి రోప్‌వే ఒక ప్యాకేజీగా, మిగతా పనులను మరో ప్యాకేజీగా విభజించారు. ఈ మేరకు రోప్‌వే కోసం పిలిచిన టెండర్లను ఈ నెల 3న తెరవగా, రూ.18.05కోట్లతో కోల్‌కత్తాకు చెందిన ఏజెన్సీ ఈపనులను దక్కించుకుంది. మిగతా రూ.38.76కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన ఖిల్లాపై కోట గోడ,కట్టడాల మరమ్మతులు, రెస్టారెంట్లు, ఖిల్లా ముఖద్వారం, ప్రస్తుత టికెట్ కౌంటర్ ఆధునికీకరణ తదితర అభివృద్ధి పనుల ప్యాకేజీ టెండర్ గడువు ఈ నెల 25తో ముగియనుంది. అయితే రాష్ట్రంలోనే మొట్టమొదటగా భువనగిరి ఖిల్లా పైకి నిర్మిస్తున్న రోప్‌వే పనులకు టెండర్లు ఖరారు కావడంతో స్థానికులతో పాటు పర్యాటక ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాల్లో తేడాలతోనే పనుల్లో జాప్యం

భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనుల ప్రతిపాదనల రూపకల్పనలో తేడాలతోనే పనుల ప్రారంభంలో జాప్యం నెలకొన్నట్టు పలువురు పేర్కొంటున్నారు. స్వదేశీ దర్శన్ 2.0కు భువనగిరి ఖిల్లా ఎంపికైన వెంటనే పలువురు రాష్ట్ర, కేంద్ర ఉన్నతాధికారులు పలుమార్లు ఖిల్లాను సందర్శించి చేపట్టాల్సిన పనులపై సమీక్షించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించే బాధ్యతను ఓ ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించారు. ఈ మేరకు ఆ సంస్థ బృందం పదుల సార్లు ఖిల్లాను సందర్శించి పలువురితో చర్చించి డీపీఆర్‌ను రూపొందించింది. ఆ డీపీఆర్ ఆధారంగా అధికారులు ఒకే ప్యాకేజీగా టెండర్లను పిలవగా పనుల అంచనా వ్యయాల్లో తారతమ్యాలు, సాంకేతిక కారణాలు చూపుతూ కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో రెండో దశలో పనులను రెండుగా విభజించి టెండర్లు పిలిచారు. దీంతో రోప్‌వే పనుల టెండర్లు ఖరారు కాగా, మిగతా పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. అయితే రోప్‌వే నిర్మాణంలో కీలకమైన పిల్లర్స్ నిర్మాణానికి పనులు దక్కించుకున్న ఏజెన్సీ సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను చేపట్టింది. టెండర్లు పూర్తయ్యాక పనులను అధికారికంగా ప్రారంభిస్తారని తెలిసింది. పనుల పూర్తికి సుమారు ఏడాదిన్నర కాలం పడుతుందని అంచనా ఉంది.

జీతాలు అద్దెలు లేవ్

- గురుకులాలకు ఏడు నెలలుగా బకాయిలు
- ఉమ్మడి జిల్లాలో 82 గురుకులాలు
- అద్దె భవనాల్లో 55
- అద్దెలు రాక ఇబ్బందులుపడుతున్న యజమానులు
- గురుకులాల్లో పనిచేస్తున్న 3,280 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి అందని రూ.26 కోట్ల జీతాలు



(ఆంధ్రజ్యోతి-కోదాడ) : బడుగు, బలహీన విద్యార్థులకు విద్యను దగ్గర చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాధారణ గురుకులాలు ఏర్పాటుచేసింది. ఫలితంగా పేద విద్యార్థులు గురువుల వద్ద ఉంటూ, సహజ వాతావరణంలో జీవిస్తూ, విద్యాభ్యాసంతో పాటు తోటి విద్యార్థులతో స్నేహభావం, వ్యక్తిగత నైపుణ్యం, జ్ఞానంతో పాటు నైతిక విలువలు అలవర్చుకొని జీవితంలో రాణిస్తారనేది ప్రభుత్వ తలంపు. ఈ క్రమంలో కొన్నిచోట్ల సొంత భవనాల్లో, మరికొన్ని చోట్ల అద్దె భవనాలలో విద్యను అందిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 82 గురుకులాలు ఉంటే వాటిలో 55 భవనాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గత ఏడు నెలలుగా వాటికి సుమారు రూ.13.47 కోట్ల అద్దె సొసైటీ వారు చెల్లించకపోవటంతో భవన యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి సమస్య వచ్చినా భవన యజమానులు పట్టించుకోవటంలేదు. దీంతో మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక 82 గురుకులాల్లో పనిచేస్తున్న

- మిగతా 7వ పేజీలో...

వెట్టిచాకిరీతో వెతలు

నర్సులపైనే పీహెచ్‌సీల నిర్వహణ భారం



- డాక్టర్లు మొదలుకుని స్వీపర్ల వరకు
- అన్ని పనులు నర్సులే చేయాల్సిన పరిస్థితి
- 24గంటల ఆసుపత్రుల్లో తీవ్ర పనిఒత్తిడి
- జీవో 142 అమలు చేయాలని డిమాండ్
- అమలు చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం
- కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని నర్సింగ్ అధికారుల ఆరోపణ
- సతమతమవుతున్న నర్సులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న నర్సులు పనిభారంతో సతమతమవుతున్నారు. 24గంటల పీహెచ్‌సీలలో అయిదుగురు చొప్పున నర్సులను నియమించాల్సి ఉండగా, ప్రభుత్వం ముగ్గురితోనే సరిపుచ్చుతుండటంతో తమపై పని ఒత్తిడి పెరిగిందని నర్సులు వాపోతున్నారు. ఆఫ్‌లైన్ విధులతో పాటు, అదనంగా ఆన్‌లైన్ విధులు నిర్వర్తించాల్సి వస్తుండటంతో ఊపిరి తీసుకోని విధంగా పని చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ల పనులు మొదలుకుని ఆయాల పనుల వరకు అన్నీ తామే చేయాల్సి వస్తోందని, ఇదేమని ప్రశ్నిస్తే మెడికల్ అధికారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని, తమకు ఉపశమనం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నర్సులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 24 గంటల ఆరోగ్య కేంద్రాల్లో నర్సింగ్ అధికారులే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఎవరు విధులకు రాకున్నా, వచ్చినా, నర్సులు మాత్రం నిత్యం అందుబాటులో ఉండి పనులు చేయాల్సి వస్తోంది. రాత్రివేళ ఎమర్జెన్సీ కేసులు వస్తే డాక్టర్లు హాజరవ్వాల్సి ఉన్నా, మెజార్టీ ఆసుపత్రులకు డాక్టర్లు రావడం లేదు. నర్సులే ఫోన్లలో మాట్లాడుతూ జాగ్రత్తగా వైద్యం అందించాల్సి వస్తోంది. రోగులను, వారి అటెండెంట్లను సముదాయించి సమీప పెద్దాసుపత్రులకు పంపాల్సి వస్తోంది. నర్సులకు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాల్సిన రెస్ట్‌రూమ్‌లు, వాష్‌రూమ్‌లు, డ్రెస్సింగ్ రూమ్‌లు సైతం అందుబాటులో లేకపోవడంతో విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారిందని వాపోతున్నారు. నర్సులు పని చేసే చోట్ల కాంతివంతమైన వెలుగు ఉండేలా విద్యుత్ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుండగా, కనీసం పీహెచ్‌సీలలో విద్యుత్ సైతం ఉండటం లేదని, కరెంటు పోతే ఇన్వర్టర్లు పనిచేయడం లేదని, సదుపాయాలు కావాలని అడిగితే మెడికల్ ఆఫీసర్లు సతాయిస్తున్నారని పలువురు నర్సులు 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. డ్యూటీలో భాగంగా డాక్టర్లు రాసిచ్చిన ప్రిస్కిప్షన్ ప్రకారం రోగులకు మందులివ్వడం, ఇంజక్షన్లు ఇవ్వడంతో పాటు, కట్లు కట్టడం, ఓపీ చూడటం వంటి పనులన్నీ నర్సులే చేయాల్సి వస్తోంది. సపోర్టింగ్ స్టాఫ్ ఆయాలు, స్వీపర్లు సైతం అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు.

జీవో 142 అమలు చేస్తే నర్సులకు ఉపశమనం

నర్సింగ్ సేవల్లో నాణ్యతను పెంచడంతో పాటు, నర్సింగ్ స్టాఫ్‌కు పనిభారం నుంచి ఉపశమనం కలిగించేందుకు వీలుగా 2023లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.142 విడుదల చేసింది. దీని ప్రకారం ప్రతీ 24 గంటల పీహెచ్‌సీలో అయిదుగురు నర్సులను నియమించాల్సి ఉంటుంది. అదేవిధంగా పీహెచ్‌సీలలో జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా మరో ఇద్దరు ఏఎన్‌ఎమ్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాల్సి ఉంది. అయితే జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద ఈ నియామకాలకు బడ్జెట్ లేదనే సాకు చెబుతున్నారు. అయితే వాస్తవానికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రంలో ఖర్చు చేయడానికి భారీగా నిధులు వస్తున్నా, వాటిని వినియోగించకుండా కాలయాపన చేస్తున్న విషయాలు పలుమార్లు వెలుగులోకి...

- మిగతా 8వ పేజీలో...

24గంటల పీహెచ్‌సీల్లో ఐదుగురు నర్సులు ఉండాల్సిందే

24గంటల పీహెచ్‌సీలలో తప్పనిసరిగా అయిదుగురు నర్సులతో పాటు ఒక రిలీవర్‌ని నియమించాల్సిందేనని పలువురు నర్సింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురితోనే నెట్టుకొస్తుండటంతో విధుల్లో ఉండే నర్సులు సెలవులు లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. పబ్లిక్ హాలిడేస్, సీఎల్స్ ఇతర ప్రత్యేక లీవులను సైతం వాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆపద వచ్చినా ఉద్యోగం చేయక తప్పడం లేదని నర్సులు వాపోతున్నారు. అంతేకాక ప్రతీ నర్సు అదనంగా పనిచేయకతప్పడం లేదని చెబుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అధికారుల నుంచి వేధింపులు వస్తున్నాయని, ఏడ్చి గోల చేస్తే తప్ప అత్యవసర సమయాల్లో సైతం సెలవులు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



నల్లగొండలో ఏసు శిలువ దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

•8లో..

పరుల కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తాం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మునుగోడు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మనకోసం కాకుండా పరుల కోసం జీవిస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలివెల గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు కొండవీటి బచ్చిరెడ్డి, కొండవీటి జగన్మోహన్‌రెడ్డి విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన కోసం కాకుండా పరుల కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తామని, దానికి గురునాథ్‌రెడ్డి, బచ్చిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి నిదర్శమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం చేసి యావత్ తెలంగాణ ప్రజలకు వారు పోరుబాట చూపారన్నారు. గురునాథ్ రెడ్డి నాటి చిన్న కొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నైజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పలివెలగడ్డ నుంచి కొండవీటి కుటుంబంతో పాటు ఎంతోమంది యోధులు తిరుగుబాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీర్ల ఫోరం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు, కొండవీటి సునీల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వరాజ్యం, మాజీ జడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, చెరుకుపల్లి వెంకన్న, చెరుకు జనార్ధన్, చెరుకు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో శాంతిభద్రతలు క్షీణించాయి



మల్లీశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- మల్లీశ్వరి కుటుంబ సభ్యులకు పరామర్శ

నిడమనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామానికి చెందిన దళిత యువతి దర్శారపు మల్లీశ్వరి చిత్రపటానికి శుక్రవారం రాత్రి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మల్లీశ్వరిది ఆత్మహత్య కాదని, కుల వివక్ష చేసిన హత్య అని ఆరోపించారు. మల్లీశ్వరి మృతిపై పోలీసులు కేవలం అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, ఇంతవరకు తల్లిదండ్రుల వాంగ్మూలం కూడా తీసుకోలేదని విమర్శించారు. ఆమె మృతికి కారణమైన అందరు నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత బిడ్డకు అన్యాయం జరిగితే సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. భట్టి విక్రమార్క, సీతక్కకు సిగ్గుందా? అని ఘాటుగా విమర్శించారు. అగ్ర కులానికి చెందిన దిశ అనే యువతిపై అఘాయిత్యం జరిగితే ఎన్‌కౌంటర్లు చేసిన ఘటనలు గతంలో ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్‌కౌంటర్ చేయాలని తాము కోరడం లేదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఇంత సంఘటన జరిగినా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జానారెడ్డి పరామర్శించకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఆందోళన చేస్తామన్నారు. పోలీస్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, నాయకులు తాటి సత్యపాల్, కామర్ల జానయ్య, రాం అంజయ్య, బొల్లం రవి, చిలుముల సంతోష్, పెదమాము యాదయ్య, నల్లబోతు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిడమనూరు మండల కేంద్రంలో కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



పజ్జూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు వెంటనే నగదు చెల్లించేలా చూడాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని పజ్జూరు, గోదారిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ నిర్వాహకులు చూసుకోవాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాగునీరు, చలువ పందిళ్లు ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి, ఆయా గ్రామాల సీసీలు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండరూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని మగ్దుం భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం వల్ల మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా స్వామ్యవాదులు, మేధావులు, ఉద్యమకారులను అన్ని వర్గాల ప్రజలు ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను సంపన్న వర్గాలకు కట్టబెడుతోందని, పేదలపై పన్నుల భారం మోపుతుందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500లకు గ్యాస్ పంపిణీ చేస్తుంటే కేంద్రం గ్యాస్ సిలిండర్ ధర రూ.50లు పెంచడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న భూభారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ వాతావరణంలో మార్పులతో వర్షాలు కురుస్తున్నాయని, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, పల్లా నర్సింహారెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, పల్లె నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, అంజయ్య చారి, బొల్గూరి నర్సింహ, టి.వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు 'తుమ్మడం' విద్యార్థుల ఎంపిక

నిడమనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన టీజీ సెట్ పరీక్ష ఫలితాల్లో తుమ్మడం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశం కోసం అర్హత సాధించారు. పాఠశాలకు చెందిన కృష్ణప్రియ, భార్గవి, జయశ్రీ, సీహెచ్ భార్గవి, లాస్య, అర్జున్ ఆరుగురు పరీక్షకు హాజరు కాగా అందరూ ఎంపికైనట్లు హెచ్ఎం పుట్ల నాగయ్య తెలిపారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు గోపిడి అనిల్‌రెడ్డి అన్నారు. వెంకటేశ్వరనగర్ (మాల్)లో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తి కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కనిగిరి గోవర్ధన్, సందపట్ల రాజేష్ సాగర్, లక్ష్మణ్ సాగర్, గొట్టే పర్వతాలు, క్రాంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వడదెబ్బకు దూరం

● డాక్టర్ సుచరిత, వైద్యాధికారి, వేములపల్లి



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వేములపల్లి వైద్యాధికారిసుచరిత సూచించారు. లేని పక్షంలో వడదెబ్బకు గురై ప్రాణాపాయ స్థితికి వెళ్తారని అప్రమత్తంగా ఉండాలని ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. (ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: వడదెబ్బతో ఎలాంటి ప్రమాదం జరుగుతోంది.

వైద్యాధికారి: శరీరం అధిక ఉష్ణోగ్రతకు గురికావడం వల్ల వికారం, వాంతులతో రోగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రాణపాయం స్థితి కలిగే అవకాశం ఉంది

ఆంధ్రజ్యోతి: లక్షణాలు ఏంటి?

వైద్యాధికారి : వడదెబ్బకు గురైనప్పుడు అతిగా దాహం వేస్తుంది. నాలుక పొడిబారిపోతుంది. చర్మం చల్లబడుతుంది.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ తగిలినప్పుడు ఏం చేయాలి?

వైద్యాధికారి: రోగిని నీడ వద్దకు, చల్లని ప్రదేశానికి తరలించాలి. తడి బట్టలతో శరీరాన్ని తుడవాలి. నీటితో పాటు మజ్జిగ లేదా ఓఆర్ఎస్ తాగించి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. విశ్రాంతినివ్వాలి.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యాధికారి : వేసవిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటలలోపు వీలైనంత వరకు బయటకు వెళ్లకపోవడమే మేలు. వదులైన దుస్తులు ధరించాలి. ఎండలో వెళ్లాల్సి వస్తే టోపి, గొడుగు వాడాలి.

ఆంధ్రజ్యోతి : పీహెచ్‌సీలో మందుల కొరత ఉందా?

వైద్యాధికారి : లేదు. అన్ని రకాల వ్యాక్సీన్లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ఆరోగ్య మహిళా కార్యక్రమం కొనసాగుతుందా?

వైద్యాధికారి : కొనసాగుతుంది. మహిళలు ఎదుర్కొనే 8రకాల ఆరోగ్య సమస్యలకు ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నాం.

కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన



డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల

» ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న డిండి మోడల్ స్కూల్

» వివిధ రంగాల్లో రాణిస్తున్న పాఠశాల విద్యార్థులు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారుమూల గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది డిండి మోడల్‌స్కూల్. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో డిండి మండల కేంద్రంలో 320 మంది విద్యార్థులతో 2013-14 సంవత్సరంలో పాఠశాల ప్రారంభమైంది. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 700కు చేరింది.

- (ఆంధ్రజ్యోతి-డిండి)


6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందిస్తున్న మోడల్‌స్కూల్(ఆదర్శపాఠశాల)లో ప్రవేశానికి తీవ్రపోటీ ఉంటుంది. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేస్తుంది పాఠశాల. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నారు. విద్యతోపాటు సహపాఠ్యాంశాలలో ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటి, నీట్, ఐఐఐటీ, ఎన్ఎంఎంఎస్‌లో ఉపాధ్యాయులు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే అనేక విద్య సంస్థల్లో సీట్లు సాధించి వివిధ రంగాలలో విద్యార్థులు స్థిరపడ్డారు. క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు చూరగొంది. విద్యార్థుల సందేహాలు, నివృత్తి చేస్తూ అభ్యసనపై ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రగతిని మూల్యాంకనం చేస్తు మెరుగైన విద్యను అందిస్తున్నారు ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు.

రైజింగ్ ఇండియా పథకానికిఎంపిక

ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న డిండి ఆదర్శ పాఠశాలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా అనే పథకానికి 2023-24 విద్యాసంవత్సరంలో ఎంపిక చేసింది. దీంతోపాటు అటల్, టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు ద్వారా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసి న సైన్స్‌స్టాల్స్ ఇన్‌స్పైర్ మానక్ అవార్డులు గెలుచుకున్నాయి. 2024-25 సంవత్సరానికి పాఠశాలలో చదువుతున్న శ్రవణ్‌కుమార్, కాస మనీష్, ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థి రాహుల్ రంగనాథ్ శ్రీహరికోటలో శాస్త్రవేత్తలతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం యువ వికాసానికి ఎంపికయ్యారు. విద్యతోపాటు క్రీడారంగంలో కూడ ఇక్కడ విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. క్రమశిక్షణకు మారుపేరుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కౌట్ విద్యార్థులుగా చెప్పవచ్చు. జాతీయ పర్వదినాలతోపాటు సైన్స్‌డే, మ్యాథమెటిక్స్‌డే వంటి అనేక కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తుంటారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా కంప్యూటర్ ల్యాబ్, అగ్రికల్చర్, బ్యూటీవెల్‌నెస్‌లో ఒకేషనల్ కోర్సులు, అగ్రికల్చర్ ల్యాబ్, బ్యూటీవెల్‌నెస్ ల్యాబ్‌లు పాఠశాలలో ఉన్నాయి. అన్ని మౌలిక వసతులు విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడ్డాయి.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తు పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తుంటారు. 12ఏళ్లలో 57 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. ఎంబీబీఎస్‌లో ఆర్.వెన్నెల(ఓయూ), విజయలక్ష్మి, మల్లేష్, ఎం. అనిల్‌కుమార్, కె.ప్రశాంత్ సీట్లు సాధించారు. బాసర ట్రిబుల్ ఐటీకి 12 మంది విద్యార్థులు ఎంపి కకాగా ఐఐటీకి బి.పరిమళ(మద్రాస్), పవన్(తిరుపతి), ఎన్ఐటీకి దేవిప్రియ(నాగపూర్), దినేష్ (మణిపూర్), కె.నవీన్‌లు ఎంపికయ్యారు. క్రీడా రంగంలో కూడ విద్యార్థులు రాణిస్తున్నారు. రాఘవి జాతీయస్థా యిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. పింకి, అభినయశ్రీ, శైలజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణిస్తున్నారు.

దాతలు సహకారిస్తే మరింత ప్రగతి చూపిస్తాం



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తాం. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. చదువుకుంటునే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇంకా మెరుగైన విద్య ను అందించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు తోడ్పాటును అందిస్తారు.

-నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్

ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి



పెద్దవూరలో టీయుఎఫ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు తెలంగాణ సత్యం, ఇతర నాయకులు

పెద్దవూర, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు తెలంగాణ సత్యం డిమాండ్ చేశారు.. శుక్రవారం మండల కేంద్రంలో టీయుఎఫ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల, అమరవీరుల ఆశయ సాధన కోసం టీయూఎఫ్ కృషి చేస్తోందని అన్నారు. డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమావత్ నగేష్, కుక్కమూడి ముత్యాలు, దుబ్బ రమేష్, రమావత్ రవికుమార్, తరి రామకృష్ణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ పరామర్శ



నరసమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని బడాయిగడ్డ గ్రామంలో తిరుమలగిరి(సాగర్) మాజీ ఉప సర్పంచ్ వలవాయి అంజయ్య మాతృమూర్తి వలవాయి నరసమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. ఆమె మృతదేహంపై ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పగడాల సైదులుయాదవ్, మాజీ ఎంపీటీసీ ఉర్ల వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు పాతనబోయిన భాస్కర్, సురేష్, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా



విజయ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, తిరుమలగిరి(సాగర్)ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలు కుటుంబాలకు అండగా ఉంటానని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలం శ్రీనాథపురం గ్రామానికి చెందిన కార్యకర్త చింతకాయల విజయ్ కుమార్ ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అదే విధంగా నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీక్షంరెడ్డిని కూడా పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, నాయకులు మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, చీమల కోటయ్య, శేఖర్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి ఉన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన అనుముల మరియమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదం బారిన పడటంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలై నల్లగొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నల్లగొండ ఆసుపత్రిలో ఆమెను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యం మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

మల్లీశ్వరి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

నిడమనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ర కుల దురహంకారానికి బలైన దళిత యువతి ధర్మారపు మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామంలో కేవీపీఎస్ నాయకులు మల్లీశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మల్లీశ్వరిది అగ్ర కుల దురహంకార హత్యేనని అన్నారు. ఆమె మృతికి కారణమైన నిందితుడు కుక్కల జాన్‌రెడ్డి ఆస్తులను జప్తు చేసి మల్లీశ్వరి కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో మోసం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 129 కుల దురహంకార హత్యలు జరిగాయన్నారు. ఆయన వెంట కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున, బొట్టు శివకుమార్, కోడిరెక్క మల్లయ్య,శ్రీను, దొంతాల నాగార్జున, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



దేవరకొండలో రైతులకు స్ప్రింక్లర్లు, పైపులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ వ్యవసాయ మార్కెట్‌లో తెలంగాణ ఉద్యానవన పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మసేద్యం పరికరాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు సబ్సిడిపై స్ప్రింకర్లు, పైపులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రతిరైతుకు లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక పంట దిగుబడులు సాధించుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ముత్యాల సర్వయ్య, కృష్ణ, లక్ష్మీపతి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పాపనాయక్, వెంకటయ్య, బస్వారెడ్డి, కొర్ర రాంసింగ్, హరికృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించొద్దు

డిండి : రైతులు పండించిన ధాన్యాన్ని మధ్య దళారీలకు విక్రయించి నష్టపోకూడదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డురకం వరిధాన్యం కొనుగోలు చేయడంతోపాటు గత ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం సన్నరకాలు క్వింటాకు రూ.500 రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతులకు బోనస్‌గా ఇస్తుందని తెలిపారు. రైతు కష్టాలు తెలిసిన నాయకుడిగా రైతులకు మేలు చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు కేటాయించారని అన్నారు. మధ్య దళారులకు విక్రయించిన వారు క్వింటాకు రూ.500 బోనస్ నష్టపోతారని తెలిపారు. కష్టపడి పంట పండిం చిన రైతుకు వ్యవసాయ మార్కెట్‌లో ఎలాంటి నష్టంలేకుండా ధాన్యాన్ని విక్రయించి, ఆనందంగా ఇంటికి వెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. ధరణిలో రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతులు అధికారుల చుట్టు తిరగవలసి వచ్చేదని, భూభారతితో అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించబోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, పోలం లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రావు, బద్దెల శ్రీను, గడ్డమీది సాయి, లక్‌పతినాయక్, ఏవో రెహనా, ఏఈవో పరమేశ్వరి, మేకల కాశయ్య పాల్గొన్నారు.

చందంపేట : రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట మండలం గుంటిపల్లి స్టేజీ వద్ద ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి నాణ్యమైన ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్నబియ్యం పథకం ప్రారంభించిందని, త్వరలో ఇందిరమ్మ ఇళ్లను కూడ నిర్మిస్తామని తెలిపారు. చందంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగునీరు అందించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దొడ్డురకం ఏగ్రేడు ధాన్యానికి క్వింటాకు రూ.2320, బిగ్రేడు రకం ధాన్యానికి రూ.2300గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం విక్రయించిన తరువాత పది రోజులలో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొంగ్ర శ్రీశై లం యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు మన్మధరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు బద్యానాయక్, గోసుల అనంతగిరి, యువజన కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

నేడు భూభారతిపై సదస్సు

● హాజరు కానున్నకలెక్టర్ ఎమ్మెల్యే

పెద్దవూర, తిరుమలగిరి సాగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై శనివారం మండల కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా భూభారతిపై తిరుమలగిరిలోని శ్రీశ్రీనివాస ఫంక్షన్‌హల్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, హాజరవుతున్నందున అన్ని గ్రామాల నాయకులు, విద్యావంతులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

'ఉపాధి' పథకానికి రూ.2,500 కోట్లు కేటాయించాలి



మురుపునూతలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఆనంద్

చందంపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రూ.2500 కోట్లు ఉపాధిహమీకి కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చందంపేట మండలం మురునూతల గ్రామంలో ఉపాధిహమీ కూలీల పని ప్రదేశంలో కూలీలను అడిగి సమస్యలు తెలు సుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉపాధిహ మీ కూలీకి రూ.600 చెల్లించాలని ఉపాధిహమీ పనిదినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని కోరారు. ఆయన వెంట కమిటి సభ్యులు పర్వత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పాపయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



మిర్యాలగూడలో శిలువతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణ చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి ఆధ్వర్యంలో శిలువతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ధీరావత్ హన్యానాయక్ మాట్లాడుతూ ఈస్టర్ ఆదివారాని 72గంటలు ముందు వచ్చే శుక్రవారాన్ని గుడ్ ఫ్రైడే అంటారన్నారు. ఈస్టర్ వరకూ ఉపవాస దీక్షలు చేపడతారన్నారు. ప్రేమ, త్యాగానికి ప్రతిరూపమైన క్రీస్తు మరణం యొక్క జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ప్రేయర్ జరుపుతామన్నారు. అనంతరం పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాభాయి, జనార్ధన్, డేవిడ్, అబ్రహం పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : ఏసుక్రీస్తు త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అని ఫాదర్ జయరాజ్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం సాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసఫ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ప్రధాన గేటు నుంచి ఏసుక్రీస్తు శిలువ మోస్తున్న సన్నివేశాలను ప్రదర్శిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు అంతయ్య, ఫ్రాన్సిస్, మల్లిఖార్జున, రమేష్, లలిత, మతీనా, క్లారా పాల్గొన్నారు.

హాలియా : హాలియా మున్సిపాలిటీలోని నిర్మల చర్చిలో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఫాదర్ మార్నేని బాలరాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చెన్నుపాటి డొమినిక్, కాకుమాను బాలస్వామి, గాదె శౌరెడ్డి, చెన్ను వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరు, చిన్నపురి, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నపురిలో శిలువ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ గ్రెగోరి, శాంసన్, కొంక ప్రవీణ్ కుమార్ , అలెగ్జాండర్, మారయ్య, రాయప్ప, ప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.

వెట్టిచాకిరీతో వెతలు

(5వపేజీ తరువాయి)

వచ్చాయి. పీహెచ్‌సీలలో నర్సులపై పనిభారం తగ్గించే నిమిత్తం, నియామకాలు జాప్యమైతే, అప్పటివరకు జీజీహెచ్‌లు, డీఎంహెచ్‌వోలు, టీజీవీవీపీల నుంచి రేషనలైజేషన్ ద్వారా సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులు నియామకాలు, ఈ సర్దుబాటు ప్రక్రియను చేపట్టకుండా ఉన్న వారిపైనే పనిభారం మోపుతూ కాలయాపన చేస్తున్నారు. ఈ నియామకాలు జరగకుండా ఉండేందుకు కొన్ని సంఘాలు, కొందరు సంఘ నాయకులు బలంగా అడ్డు పడుతున్నారని నర్సులు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు వెట్టిచాకిరీ తప్పడం లేదని వారు వాపోతున్నారు. రేషన్‌లైజేషన్ జరిగితే శాఖపైన తమ పట్టుతప్పుతుందనే భావనలో ఉన్న అధికారులు, ఉద్యోగులు దీనిని అడ్డుకుంటున్నట్లు నర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. నర్సుల నుంచి పదేపదే వస్తున్న విజ్ఞప్తుల మేరకు కొందరు డీఎంహెచ్‌వోలు, 24 గంటల పీహెచ్‌సీలలో ముగ్గురు నర్సులు ఉన్న చోట అదే పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై తీసుకుని, ఇక్కడ బాధ్యతలు అప్పగించాలని పీహెచ్‌సీల మెడికల్ అధికారులకు సర్క్యులర్ ఇచ్చినా, మెడికల్ అధికారులు మాత్రం వాటిని అమలు చేయడం లేదు. పైగా ముగ్గురు నర్సులు మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నారని, పని ఒత్తిడి ఏముందని దబాయిస్తున్నారని పలువురు నర్సులు వాపోతున్నారు. నర్సులకు వారంలో 40 గంటల పనితో పాటు, ఓవర్ టైమ్ చేస్తే, డేఆఫ్ ఇవ్వాలని, ఇంకా నర్సుల సంక్షేమం పేరుతో కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కనీసం జిల్లాల్లో అమలు చేయడం లేదని వాపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి నర్సుల పని ఒత్తిడి, జీవో నెం.142 అమలు అంశాలను రాకుండా కొన్ని శక్తులు అడ్డుపడుతున్నాయని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు పీహెచ్‌సీలలో పనిచేసే నర్సుల పని ఒత్తిడిని గుర్తించి, ప్రభుత్వానికి నివేదించాలని, తద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని నర్సులు కోరుతున్నారు. పీహెచ్‌సీలలో అయిదుగురు నర్సుల చొప్పున నియామకాలైనా చేపట్టాలని, లేకపోతే జీవో నెం.142 అయినా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలువురు నర్సింగ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

పగలే వెలుగులు..



మిర్యాలగూడలోని జ్యోతి ఆస్పత్రి రోడ్డులో వెలుగుతున్న వీధి దీపం

విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పురపాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీలతో పాటు ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ బైక్‌లు, ఆటోలపై ప్రచారం నిర్వహించే అధికారులు విద్యుత్ వృథాను అరికట్టలేకపోతున్నారు. విద్యుత్ ఆదాపై మునిసిపాలిటీ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

● మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వం అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



పెద్దవూరలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

పెద్దవూర, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నరసింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నాగార్జునసాగర్ - హైద్రాబాద్ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు 33 రకాల సన్న దాన్యం, దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని, సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు ఒక క్వింటాకు 4, 5కేజీల తరుగు తీయడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెట్టకుండా రైతుల ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చ కార్యదర్శి ఏరుకొండ పద్మ, రైతులు కంటి వెంకట్‌రెడ్డి, వడ్డెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తరి గిరి, వెంకటయ్య, సాయిరెడ్డి, అశోక్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.